

# శ్రీ భగవద్గీతా మకరందం!



శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

78

## పదకొండవ అధ్యాయము - విశ్వరూప సందర్శన యోగము

**34. ద్రోణం చ భీష్మం చ జయద్రథం చ**
**కర్ణం తథాఽన్యానపి యోధవీరాన్**
**మయా హతాంస్త్వం జహి మా వ్యథిష్ఠా**
**యుధ్యస్వ జేతాసి రణే సపత్నాన్.**

**వ్యాఖ్య:** 'మావ్యథిష్ఠాః'- భయపడవలదు. ఇది సర్వులకును చక్కని ఉదేశము. సర్వేశ్వరుని శరణు బొంది తన కర్తవ్యమును ధర్మపూర్వకముగ నాచరించువాడిక దిగులునొందనేల? భయపడనేల? కనుకనే భగవాను డర్జునునకు తన కర్తవ్యమును తన విధ్యుక్తధర్మమును, ధైర్యముతో, నిర్భయముతో నాచరింపవలసినదిగా బోధించుచున్నాడు. 'మావ్యథిష్ఠాః' అను భగవద్వాక్యమును సర్వులున్ను తమ నిత్యవ్యవహారములందు జ్ఞాపకముంచుకొనవలసియున్నది. జీవితరంగమున మనుజులు పెక్కుచోట్ల అనేక క్లేశములను, ప్రతిబంధములను ఎదుర్కొనవలసి యుండును. అత్తఱి ఈ పై వాక్యములను స్మరించి ధైర్యమును తెచ్చుకొనవలెను. అర్జునునివలె సమస్తము భగవదర్పణముచేసి భగవానుని వినిర్మతచిత్తముతో నాశ్రయించి తన కర్తవ్య కర్మమును నెరవేర్చుచో ఇక జీవుడు వెతలొందవలసిన పనిలేదు. ఇచ్చట 'యధ్యస్వ' (యుద్ధమును చేయుము) అను పదము వారివారి కర్తవ్యనిర్వహణమును సూచించుచున్నది. 'జేతాసి' (జయింపగలవు) అను పదము ఫలమును నిరూపించుచున్నది. అనగా- ఈ ప్రకారము సర్వేశ్వరుని ఆశ్రయించి తన కర్తవ్యము నెరవేర్చువాడు ఉత్తమ ఫలితమును తప్పక పొందగల్గునని, విజయమును తప్పక సాధించునని భావము. కార్యవిజయమున కిదియే ఉపాయము. ఎచట శ్రీకృష్ణుడు (భగవాద్భావము) ఉండునో అచట విజయము తథ్యము.

శ్రీకృష్ణుడు గీతను బోధించుసమయమునకు భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు మున్నగువారు జీవించేయున్నారు. కాని వారు మరణించునట్లు భగవానుడర్జునున కిచట తెలిపిరి. ఇది యేమి ఆశ్చర్యము! దీనికి కారణము గలదు. ఈ విషయము నింతకుముందే 27వ శ్లోకవ్యాఖ్యమందు తెలుపబడినది. భగవానుడు కాలతీతుడు. వారియందు భూతభవిష్యద్వర్తమానములను కాలభేదములు లేవు. కనుకనే భవిష్యద్వృత్తాంతమును (భీష్మాదులమృతిని) వర్తమానకాలమందు జూపగల్గిరి. దీనివలన మనుజుల కొక చక్కని గుణపాఠము లభించుచున్నది. అది యేదియనిన 'ఈ కానుపించు బంధుమిత్రాదులు, సిరిసంపదలు మున్నగునవియన్నియు భవిష్యత్కాలమున వినాశమొందునవే అయియున్నవి' అని స్పష్టముగా తెలియుచున్నది. ఆ భవిష్యచ్చిత్రమును విజ్ఞులిపుడే తమ హృదయమందు చిత్రించుకొని, వైరాగ్యాదుల నభ్యసించవలెను. బుద్ధదేవు డాప్రకారమే 'మరణము'ను గూర్చి దేహాదుల అశాశ్వత్త్వమును గూర్చి ముందుగనే బాగుగ చింతించి తద్భావనచే మహోపకారమును బొందగల్గిరి.

భగవానుని యా వాక్యములను విని అర్జును డేమియొనర్చెనో సంజయుడు చెప్పుచున్నాడు-

**35. ఏతచ్ఛ్రుత్వా వచనం కేశవస్య**
**కృతాఞ్జలిర్వేపమానః కిరీటి**
**నమస్కృత్వా భూయ ఏవాహ కృష్ణం**
**సగద్గదం భీతభీతః ప్రణమ్య.**

**వ్యాఖ్య:** (1) చేతులు జోడించుకొనుట (2) నమస్కరించుట (3) వినమ్రుడై (బాగువంగి) పలుకుట- మున్నగు క్రియలు అర్జునుని పరిపూర్ణభక్తిభావమును, నమ్రతను సూచించుచున్నవి.

**36. స్థానే హృషీకేశ తవ ప్రకీర్త్యా**
**జగత్ప్రహృష్యత్యనురజ్యతే చ**
**రక్షాంసి భీతాని దిశో ద్రవన్తి**
**సర్వే నమస్యన్తి చ సిద్ధసఙ్ఘాః**

**వ్యాఖ్య:** 'తవప్రకీర్త్యా జగత్ప్రహృష్యతి' - భగవన్నామ సంకీర్తనముచేతను, భగవన్మహిమల కథనము చేతను జనులు అత్యంత హర్షమును బొందుచున్నారని అర్జునుడు పలికెను. 'హృష్యతి' అని చెప్పడం 'ప్రహృష్యతి' అని చెప్పుట వలన అట్టివారు అపారమగు ఆనందమును బడయుచున్నారని అర్థము. దీనినిబట్టి అతిహర్షమునకు, దుఃఖరాహిత్యమునకు భగవన్నామోచ్చారణ, భగవద్విచారణయే మార్గమని స్పష్టమగుచున్నది.

'రక్షాంసి భీతాని దిశోద్రవన్తి' - భగవద్దర్శనముచే రాక్షసులు పలాయనము చిత్తగించుచున్నారని చెప్పబడినది. అనగా ఎచట పరమాత్మయుండునో, ఎచట పవిత్రతయుండునో, ఎచట సద్గుణములు విరాజిల్లునో, అచట భూతపేతపిశాచ రాక్షసాదులు లేక కామాది దుష్టప్రవృత్తులు ఉండనేరవని భావము. కావున జీవులు తమ హృదయసీమయందు దేవదేవుడగు పరమాత్మను భక్త్యాదులచే ప్రతిష్ఠజేసి కొనినచో, ఇక అజ్ఞానాదులు, దంభదర్పాదులు, రాగేద్వేషాదులు, కామక్రోధాదులు అట నిలువలేక పరుగడిపోవును. రాక్షసులు బయటనేకాదు, హృదయమందును కాపురముందురు. వారే పైనతెల్పిన యసురగుణములు. భగద్ధ్యానముచేతను, భగవత్సంకీర్తనము చేతను పరమాత్మ నెపుడు జీవుడు తనయం దాహ్వానించుకొనునో అపుడిక ఆ అసురీ సంపద వెంటనే కాలికి బుద్ధిజెప్పును. ఈ సత్యమును నిరూపించుటకే కాబోలు అర్జునుడు పైవిధముగా స్తుతించెను.

ఈ శ్లోకమునందు బీజాక్షరములు ఎక్కువగ కలవనియు, దీనిని జపించినవారికి భూతప్రేత పిశాచాదుల బాధ యుండనేరదనియు, భూతప్రేతాదుల బాధ గలవారీ శ్లోకమును భక్తితో, భావముతో జపించినచో ఆ బెడద తొలగిపోగలదనియు పెద్దలు చెప్పుదురు.

**37. కస్మాచ్చ తే న నమేరన్మహాత్మన్**
**గరీయసే బ్రహ్మణోఽప్యాదికర్త్రే**
**అనన్త దేవేశ జగన్నివాస**
**త్వమక్షరం సదసత్తత్పరం యత్.**

**వ్యాఖ్య:** 'సదసత్తత్పరుమ్' - పరమాత్మ సత్, అసత్తులకు పరమైనవాడు. సత్ అనగా - స్థూలపదార్థము (లేక స్థూలజగత్తు), అసత్ అనగా సూక్ష్మ పదార్థము, (లేక సూక్ష్మ జగత్తు). ఆ రెండింటికిని పరమాత్మ విలక్షణమై పరమై వర్తించునని భావము. లేక 'సత్' అనగా మనస్సనియు, 'అసత్' అనగా దేహమనియు చెప్పవచ్చును. అపుడును ఇదియే అర్థమిచ్చును. స్థూలమగు భౌతిక ప్రపంచమైనను, సూక్ష్మమగు మనఃప్రపంచమైనను రెండు పరమార్థ దృష్టిలో మిథ్యాభూతములే యగును. పరమాత్మ యొకడే సత్యవస్తువు. కావుననే మిథ్యాభూతములగు ఆ దృశ్యజగత్తుల కంటె అతడు పరమైనవాడని యిట పేర్కొనబడినది.

- (తరువాయి వచ్చే సంచికలో)

తెలుగునేల మీద నాట్యాలు క్రీస్తుకు పూర్వం నుంచే బహుళ ప్రచారంలో ఉన్నాయి. మన నాట్యానికి రెండువేల సంవత్సరాల చరిత్ర వుంది. హాలుని గాథాసప్తశతిలో మన నాట్యాల ప్రస్తావన ఉంది. బుద్ధుని జీవిత చరిత్ర లలిత విస్తారం ప్రకారం గౌతమబుద్ధుడు మంచి నాట్యశాస్త్రవేత్త, బుద్ధుడు రాజగృహంలో ఉన్నప్పుడు బుద్ధుని సమక్షంలో కువలయ అనే నాట్యగత్తె బుద్ధుని చరిత్రనే అభినయించింది. ఈ కువలయ దక్షిణాదికి చెందిన నర్తకి.

### శాతవాహనులు తొలి రాజపోషకులు

మన రాష్ట్రాన్ని పరిపాలించిన తొలి రాజులు శాతవాహనుల కాలంలో సంగీతం, సాహిత్యం, నృత్యం, శిల్పం, చిత్రలేఖనం వంటి లలితకళలు ఎంతగానో అభివృద్ధి చెందాయి. అనేక రకాల నృత్యసంప్రదాయాలు వర్ధిల్లాయి.

### కాకతీయుల పోషణ

కాకతీయ సామ్రాజ్యాన్ని పరిపాలించిన ప్రతాపరుద్రుడి బావమరిది, కాకతీయ సైన్యాధ్యక్షుడు జాయపసేనాని 1254లో నర్త రత్నావళి అనే నాట్య శాస్త్రం రచించాడు. ఎంతో అమూల్యమైన సమాచారం ఇందులో ఉంది. అందులో పేరిణి, ప్రేంఖని, రాసకం, చర్చరి, నాట్యరాసకం, దండరాసకం, శివప్రియం, చిందు, కందుకం, భాండికం, ఘంటసరి, బహురూప, కోలాటం వంటి పలు దేశి నృత్యాలను విపులీకరించాడు.

### రాయల హయాంలో ప్రతీక చెప్పనలేదు

మన రాష్ట్రాన్ని ఇక్ష్వాకులు, చోళులు, పల్లవులు, విజయనగర రాజులు, రెడ్డి రాజులు, వెలమప్రభువులు, నాయక రాజులు పరిపాలించారు. విజయనగరాధీశుల కాలంలో రూపుదిద్దుకున్న లేపాక్షి ఆలయంలో ఎన్నో నాట్య శిల్పాలున్నాయి. శ్రీశైల దేవస్థానంలో శృంగనాట్యం, సప్తలాస్యం ప్రదర్శించినట్టు ఆలయంలోని శిల్పకన్యకలు సాక్ష్యం పలుకుతున్నాయి.

విజయనగర రాజుల కాలంలో స్వర్ణయుగాన్ని చూసిన హంపి, విజయనగరాలు ఒక అద్భుత కళాకేంద్రంగా వర్ధిల్లింది. ఆరోజులలో మన దేశంలో పర్యటించిన పోర్చుగీసు యాత్రికుడు పిట్రోడెల్లా కోలాట నాట్యం గురించి చాలా వివరించాడు. నాట్యాచార్యులను భారీగా సత్కరించి, రాయలు కళలను, కళాకారులను ప్రోత్సహించేవాడని పేర్కొన్నారు.

### కొండంత తోడు కొండవీడు

కొండవీటి రెడ్డి రాజులలో చివరి రాజు కుమారగిరి ప్రభువు స్వయంగా సంగీత నాట్య ప్రవీణుడు. ఇతను 1405 కాలపువాడు. ఇతను వసంత రాజీయం అనే నాట్య లక్షణ గ్రంథం రాశాడు. ఇతని ఆస్థానంలో లకుమాదేవి అనే ఆస్థాన నర్తకి ఉండేది. యేటా వసంతోత్సవాలు జరిపించి కళాకారులను సత్కరించేవాడు.

### నాయకరాజుల కాలం అనంత స్వర్ణమయం

తంజావూరు నాయకరాజు అచ్యుతప్ప నాయకుడు కూచిపూడి భాగవతులకు అచ్యుతాపురం అగ్రహారం బహుమానంగా ఇచ్చాడు. అదే నేడు మేలమట్టూరుగా చెలామణీలో ఉంది.

### సలాములు చేసిన నిజాం నవాబు

క్రీ.శ. 1685 సంత్సరంలో కూచిపూడి భాగవతులు గోల్కొండ నవాబు అబుల్ హసన్ తానీషా వినోదం కోసం ప్రదర్శించిన భామాకలాపం చూసి ముగ్ధుడై 600 ఎకరాల విస్తీర్ణంగల మాగాణి భూమిని నవాబు నజారానాగా




ఇస్తూ ఫర్మానా జారీ చేశాడన్న విషయాన్ని ముందే వివరించాం. కూచిపూడి నాట్యానికి లభించిన అత్యున్నత పురస్కారం అది.

### ఇంటింటి కళ

తెలుగుదేశంలో ఒకనాడు సంగీత, సాహిత్య, నృత్యాలు చిత్ర కల్ప కళలు ఇంటింటా ఉండేవి. ఇవి కొందరికి కుటుంబ విద్యలుగా, కొందరికి కులవిద్యలుగా మారి జీవనభృతి కల్పించాయి. శైలిలో మమేకమై సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలపై గాఢమైన ప్రభావం చూపించాయి. మీ అమ్మాయికి నాట్యం వచ్చా అని ఇప్పటికీ అడగడం చూస్తూనే వున్నాం. అంటే లలిత కళలు ఆడవారికి నేర్పితే అది ఇంటిల్లిపాదికీ చేరుతుందన్న ఆలోచన మన పెద్దలలో ఉందని స్పష్టమవుతోంది. దాదాపు అన్ని కార్యక్రమాలలో ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేయడం చూస్తూనే వున్నాం. మన ఆధ్యాత్మిక వైభవమే కాదు మన జీవనసరళిలోనే కళ అనేది మిళితమై ఉంది. ఇంటిని అలంకరించుకునేందుకు కళాఖండాలు ఏర్పాటు చేసుకోవడం డబ్బున్న మారాజులు చేసే పని అయితే ఇంటి ముందు ముగ్గులు వేయడం, గోడలను వివిధ చిత్రాలతో అలంకరించుకోవడం ఇళ్ళల్లో చూస్తూనే ఉన్నాం. విందూ, వినోదం అన్నది జీవన నినాదం.

### జీవనశైలిని ఆడించిన నాట్యం


మనకున్న నాట్యరీతులను ఆరాధనాశైలి, కచ్చేరీశైలి, ప్రచారశైలి, జానపద శైలి, ఆటవికశైలి ఐదు రకాలుగా విభజించవచ్చు.

ఆరాధనాశైలిలోనూ దాసి ఆట, వీరనాట్యం, వీరులకొలుపు, గరగలు, కావడిచిందు, భగవతిపాట, చిరతల భజన, అగ్ని నృత్యం వంటివి ముఖ్యమైనవి.

దర్బారు నృత్యంలో ప్రత్యేకత అంటారు ఇందులో భరతనాట్యం, భోగ మాట, కళావంత నాట్యం ప్రధానమైనవి. ప్రచారం కోసం వినియోగించిన కళారూపాలలో భాగవతమాట, దండోరా, యక్షగానం ముఖ్యమైనవి. జానపద నృత్యాలలో కోలాటం, గొబ్బి, బతకమ్మ లాట, జోగాట, తప్పెటగుండు, జంగటం పాట, జముకులాట ముఖ్యమైనవి. ఆటవిక శైలిలో రుతువుల నృత్యం, పంట నృత్యం, యుద్ధ నృత్యం వంటివి ఎన్నో పూర్వకాలంలో విరాజిల్లినవి. భగవంతుడు ఆధ్యాత్మిక సువాసనలతో కల్పించిన కళ. ప్రపంచం ఉన్నంతవరకూ ఈ కళ ఉంటుంది. ●





# తొలి తెలుగు శబ్ద చలనచిత్రానికి ఆద్యుడు హెచ్.ఎం.రెడ్డి!
# తెలుగు సినిమా ఒరవడి దిద్దినవాడు బి.నాగిరెడ్డి!!
## - చెన్నపురిని ఆంధ్రా హాలీవుడ్‌గా దీప్తింపచేసిన చందురుడు! -

సినిమా వినోదమొక్కటే కాదు, ప్రజల మెదడుల్లో వెలుగులు పూయించాలి. విజ్ఞానం ఉదయింపచేయాలి, అజ్ఞానాంధకారాన్ని పోగొట్టే శక్తి సినిమాకు ఉన్నది, పత్రికలకూ ఉన్నదనే సత్యాన్ని లోకానికి చాటినవాడు నాగిరెడ్డి ఒక్కడే అని నిస్సంశయంగా చెప్పాలి.

ఖగోళగ్రహాన్ని భూమి ఢీకొని చంద్రుడు పుట్టాడని 'వేదం' యెలా చెబుతూన్నదో, రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో తాను చేస్తున్న వ్యాపారం డీలాపడి, పుట్టిన రాయలసీమ గ్రామానికి వెళ్ళినా మనిషి మాత్రం డీలాపడలేదు. ధైర్యం కోల్పోలేదు, స్థైర్యాన్ని విడనాడలేదు. చంద్రుని వెల్తురిలా ఆయన వదనంలో, ఆనందం ఆవిరి కాలేదు. నందితిమ్మన్న వర్ణించినట్టుగా 'వలిమల అల్లువాడు, తలవాక ధరించిన పూవు గుత్తి, వేల్పులగమి జీవగఱ్ఱ, ఉడివోవని చల్వలటెంకి, వెన్నెలలు మొలిచిన పాదు, పాల్కడలి ముద్దులపట్టి' అన్నచందాన ఓ 'చందమామ' పత్రికను ప్రారంభించాడు. ఓ 'ఆంధ్రజ్యోతి'ని వెలుగొందింపచేసాడు. ఇవన్నీ మన స్వాతంత్రోదయమైన 1947 సం॥ములోనే ఉదయించాయ్. పదునాలుగు లోకాల పట్టు (మెత్తని) మనసులపై వెల్తురు రేఖలను ప్రసరింపచేసిన్నట్టు, పద్నాలుగు భాషల్లో ఆయన పిల్లలూ, పెద్దలూ, ఆ పెద్దలకు పుట్టిన పిల్లలూ చదివేట్టు, రజనీకర మోహనబింబము, నగుమోము రగుల్చు ఓ చందమామ అన్నట్టు, ఆ అందాల, మకరందాల పత్రికను గ్రుడ్డివారు కూడా చదివి సంతోషించేట్టు 'బ్రెయిల్ లిపి'లో కూడా తీసుకుని వచ్చిన ఘనత ఆయనిదే! చంద్రుణ్ణి వెన్నెల విడువకుండా ఉండేట్టుగ 'తెనాలి నుంచీ వసంత వీచికలాగా వచ్చిన 'చక్రపాణి' తోడు కావడంతో 'పాలూమీగడ' కలిసినట్టు వారి స్నేహం



## బి.నాగిరెడ్డి ది బెస్ట్ నాగిరెడ్డి

*బొమ్మిరెడ్డి నాగిరెడ్డితో పోల్చదగినవాడు ప్రపంచంలోనే లేరు. ఆయన 'వేలు' పెట్టని వ్యాపారం లేదు, జనత మేలు కోరని కార్యక్రమం లేదు. పౌరులకు మేల్గూర్చే విద్య, వినోదం, వైద్యం, ఉపకారం, ఉపాధి కల్పించే కార్యక్రమాలనెన్నిటినో ఆయన తలపెట్టారు, తలపెట్టిన విధంగా చేశారు.*

*ఆయన మధ్యతరగతి ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండేట్లు విజయా హాస్పిటల్స్ ప్రారంభించారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో నలిగి పిగిలిపోతున్న ప్రజలకీ ఆధునిక ఆరోగ్య హృదయ చలన సంకేతాలు గల ఇ.సి.జి, స్కానింగు సౌకర్యాలతో పేదలకు ఉచితంగా మందులు యిచ్చే ఉపకార విధానాన్ని ప్రవేశపెట్టారు. తాను గదుల వసతి రుసుములనే తీసుకుంటూ, అదీ యివ్వలేని వారికి ఉచితంగా వసతి గదులను యిస్తూ, నిపుణులైన వైద్యసిబ్బందిని నియమించి, వారిని వైద్యసేవల నిమిత్తం 'నామినల్'గా తీసుకొనేట్టు చేస్తూ, మహోపకారం చేసారు. దూర ప్రాంతాల్నుంచీ వచ్చే శక్తీ స్తోమతులు కలవారు వారితో వచ్చే సహాయకులూ వేరే హోటల్స్‌లో ఉంటూ, శ్రమపడ్తున్న వారికి అందమైన తాజ్ హోటల్ వంటి శీతల సౌకర్యం గల విజయా హెల్తు సెంటర్న్ స్థాపించి నిపుణులైన డాక్టర్లను ఏర్పాటుచేసారు. వారికీ విషయంలో పి.వి. రమణారెడ్డి తోడుగా ఉన్నారు. విలాసవంతంగా ప్రకృతీ పైటగాలులతో స్థాపించిన విజయా హెల్తు సెంటర్‌లో కూడా అధిక ఫీజులు లేవు. ఇప్పుడలాటి పరిస్థితులు లేవు, మినహాయింపులు లేవు.*






**హిందీలో నాగిరెడ్డి నిర్మించిన రామ్ ఔర్ శ్యామ్, ఘర్ ఘర్‌కీ కహానీ, మిస్ మేరీ ఆదిగా గల చిత్రాలను, తమిళంలో మిస్సియమ్మ, ఎంగల్ వీట్టుపిళ్ళై, ఎంగల్ వీట్ పెణ్ చిత్రాలు ఘనాతి ఘనవిజయం సాధించాయ్. హిందీ చిత్రాల్లో దిలీప్‌కుమార్, తమిళ చిత్రాల్లో ఎం.జి.ఆర్. జయలలిత వంటి హేమాహేమీలు నటించారు.**

**ఆయన సేవల్ని మెచ్చిన కేంద్ర ప్రభుత్వం అత్యున్నతమైన దాదా సాహెబ్ ఫాల్కే, రాష్ట్రప్రభుత్వం రఘుపతి వెంకయ్య అవార్డు, ఇంకా ఎన్నో ఎన్నెన్నో ప్రతిష్ఠాత్మకమైన అవార్డులిచ్చి గౌరవించారు. అవార్డుల కతీతుడాయన.**

తనువులున్నంతవరకూ సాహితీ సాంస్కృతిక సేద్యం చేయించింది. 'చందమామ' చవిచూపించిన మమకారవైనాలు పత్రికల వరకే పరిమితం కాలేదు, సెల్యూలాయిడ్ దృశ్యకావ్యం వరకూ మళ్ళించి, ఆ సెందురూడే మన పెద్దమనిషి అనే ఎంకిపాటలా, వారిద్దరూ కలిసి 'విజయా ప్రొడక్షన్సు'ను ప్రారంభించి సినిమా రంగ 'షావుకార్'లై తొలి చిత్రప్రసూనంగా 'షావుకారు' చిత్రం తీయడం జరిగింది. దానితో సినిమా రంగంలో నాగిరెడ్డి పెద్ద షావుకార్ అయిపోయారు. 1949 సం॥ములో (సా)మాన్య మాననీయంగా ఉన్న వాహినీ స్టూడియోస్‌ను 'లీజు'కు తీసుకున్నారు. ఈ స్టూడియో 'చందమామ' భవానికి ప్రక్కనే ఉండడం నాగిరెడ్డికి ఇటు పత్రికా, ప్రెస్సు అటు స్టూడియో, ప్రొడక్షన్సుకు వాహినీ స్టూడియో సినీమా షావుకారీతన బలం యివ్వడంతో, మరోప్రక్కన ఉన్న రేవతీ స్టూడియోస్ కూడా క్రయం చేసి విజయ వాహినీ స్టూడియోస్‌గా తీర్చిదిద్దారు. ప్రపంచం మెచ్చే అమెరికా హాలీవుడ్ స్టూడియోలకు ధీటుగా రూపొందించడంతో 'ఆంధ్రా హాలీవుడ్' అనే ఖ్యాతి, ప్రఖ్యాతులు దానంతటవే వచ్చాయ్. అటుతరువాత విజయా వాహినీ స్టూడియోలకు అభిముఖంగా ఆర్కాటు రోడ్‌కు ఆవలి ప్రక్కనున్న పొలాలను క్రయం చేసి విజయా గార్డెన్స్ అనే బృందావనం గార్డెన్ వంటి సుందరతను రంగరించి అవుట్‌డోర్ ప్రకృతీ రామణీయతల్ని ప్రతిబింబించేలా ఏర్పాటుచేసారు. అప్పటివరకూ చలనచిత్ర నిర్మాతలకూ మై లేడీ గార్డెన్స్ (సెంట్రల్ రైల్వే స్టేషన్ ప్రక్కన ఉండేది), దక్షిణాన ఉన్న సాతనూర్ డామ్, మైసూరులోని బృందావనం గార్డెన్స్‌కు వెళ్ళే శ్రమను తగ్గించారు. స్టూడియోలో వేసే సెట్సులా – విజయా గార్డెన్‌ను విస్తృతపరిచి, నీటిపారుదల కాలువ, వంతెన, పూలదోటలు వంటి వెన్నో సహజ ప్రకృతీ సౌందర్యాలను అందులోనే తీర్చిదిద్దారు. విజయాగార్డెన్స్‌లోనే ఆధునికమైన, ఆహ్లాద వాతావరణం కల రికార్డింగు థియేటర్లను నిర్మించారు. ఓప్రక్క స్టూడియో దినదినాభివృద్ధి చెందుతూంది. మరో దిశలో విజయా ప్రొడక్షన్స్ బేనర్‌లో వరుసగా చిత్రాలను నిర్మించడం ప్రారంభమైంది.

ఇలా ఉంటూండగానే 'చందమామ' కోసం ప్రారంభించిన బి.ఎన్.కె. ప్రెస్‌ను ఆధునీకరించి కొత్త కొత్త ముద్రణా యంత్రాలతో వాల్‌పోస్టర్సును ముద్రించేట్టు రూపొందించడం దక్షిణ భారతానికే గర్వకారణమైంది. ఉత్తరాది నుంచీ ముఖ్యంగా బొంబాయి, తూర్పులో ఉన్న కలకత్తా నుంచీ వచ్చే వివిధ భాషా చిత్రాలకు కూడా ఈ బి.యన్.కె. ప్రెస్ (మరో పేరు ప్రసాద్ ప్రాసెస్)లో అందంగా, అత్యున్నతంగా పోస్టర్లు, బ్రోచర్‌లు ముద్రించడంతో, నాగిరెడ్డి పేరు దశదిశలా మారుమ్రోగింది. బ్రిటిష్ సామ్రాజ్యం విశ్వమంతటా వ్యాప్తినొందినట్టు నాగిరెడ్డి సామ్రాజ్యం విఖ్యాతమొందింది.

విజయా ప్రొడక్షన్స్‌కు నాగిరెడ్డి నిర్మాణ సామ్రాజ్యంగా తదుపరి చిత్రంగా నిర్మించిన 'పాతాళభైరవి' సూపర్‌హిట్టు. ఈ చిత్రం 1951 సం॥ములో విడుదలయింది. అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి ఎన్నికైంది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాట శతన్నరదినోత్సవాల మోత మ్రోగించింది. అటుతరువాత చంద్రహారం, పెళ్లి చేసి చూడు, మిస్సమ్మ, మాయాబజార్, గుండమ్మకథ, జగదేకవీరుడు ఎంతెంత ఘన విజయాల్ని సాధించాయో చెప్పపనిలేదు. అంతవరకూ దక్షిణాది చిత్ర పరిశ్రమనేలిన ఎస్.ఎస్. వాసన్, ఏ.వి.యం. చెట్టియార్, సేలంలోని శత చిత్రాల్ను నిర్మించిన టి.ఆర్. సుందరం, కోయంబత్తూర్‌లోని పక్షిరాజా స్టూడియోస్ శ్రీరాములు నాయుడు, అందర్నీ ఆయన తరువాత స్థానంలో నిలబెట్టి ఏకైక చిత్రమొనగాడనిపించుకున్నారు. తెలుగుతో బాటు, తమిళం, హిందీలో కూడా చిత్రాలను నిర్మించి, ఘనవిజయంగాంచిన ఖ్యాతి శ్రీ నాగిరెడ్డిదే. ఆయన తారలను తయారుచేసారు. దర్శకుల, సాంకేతి విజ్ఞుల్ని సహితమూ పెంచారు. ఏన్టీ రామారావు, ఎస్వీ రంగారావు, రేలంగి, జి. వరలక్ష్మి, జమున, సావిత్రి ఎందరో నటీనటుల్ని అందలాలు అధిష్టించేట్టు చేసారు. ఎల్వీ ప్రసాద్ అక్కడ దర్శకునిగా పెరిగి, నిర్మాతయై స్టూడియో లాబోరేటరీస్ షావుకారయ్యారు. డి. రామానాయుడు నాగిరెడ్డి నుంచీ ఎదిగినవాడే!

ఎదిగినకొద్దీ ఒదిగే స్వభావం నాగిరెడ్డిదే. నాకాయన ఆత్మీయుడు. నేను ఇల్లు కట్టుకున్నప్పుడూ, మా అబ్బాయిల పెళ్ళి చేసినప్పుడూ, నేను గోటేటి ఫిలిమ్స్‌ను ప్రారంభించి, సినిమా నిర్మాణం చేసినప్పుడూ, ఆయన స్వయంగా వచ్చి ఆశీర్వదించారు. ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఆయన హస్తవాసి మంచిది. దానికి కారణం ఆయన మంచి మనసే!

నాగిరెడ్డీ, చక్రపాణిల స్నేహం ప్రగాఢమైనది. చిత్ర నిర్మాణ వ్యవహారాల్లో నాగిరెడ్డి తలదూర్చేవారు కాదు. అంతా చూసేది చక్రపాణే! వ్యాపార విషయాల్లో చక్రపాణి తలదూర్చేవారు కాదు. అంతా నాగిరెడ్డే. నాగిరెడ్డి ప్రజల మనిషి. ప్రజాహితం కోరేవారు. ముఖ్యంగా తనక్రింద పనిచేసే ఉద్యోగులందరూ ఇళ్ళూ వాహనాలూ కొనుక్కునే శక్తి కల్పించేవారు.

చదువు, పెళ్ళిళ్ల విషయంలో ఆయన సాయమెంతో చెప్పలేము. ప్రజలకేం వి అవసరమో, ఆ పనులను చేసారు. నిర్మాత ఏ విషయంగానూ బయటకు వెళ్ళే పని లేకుండా సకల వసతులు, అవసరమైనప్పుడు ద్రవ్యసహాయం చేసేవారు.

తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి అధ్యక్షునిగా ఉన్నప్పుడు, తిరుమలను సుందరంగా తీర్చిదిద్దినదీ ఆయనే! అక్కడి చిల్లిగవ్వను కూడా ముట్టేవారు కాదు. నావంటి మిత్రులు వెళ్ళినప్పుడు ఆర్జిత సేవలకు ఆయనే డబ్బు చెల్లించేవారు. ఆయన కూడా సేవా టిక్కెట్లను కొనుక్కునేవారు. దేవస్థానంలో పనిచేసే ఉద్యోగుల పిల్లల చదువుకోసం తెలుగు, ఇంగ్లీషు మాధ్యమం విద్యగల పాఠశాలను తిరుమలలో ఏర్పాటుచేసి ప్రోత్సహించారు. ఆయన అన్న బి.యన్. రెడ్డి గొప్ప దర్శకుడు, తమ్ముడు కొండారెడ్డి ఛాయాగ్రాహకుడు. నాగిరెడ్డి సేవలకుగానీ మంచి మనసుకు గానీ మించిన మహాపురుషుడెవరూ ఇంతవరకూ పుట్టలేదు! ●

# తెలుగు మాటలు నేర్పకుండా తెలుగు మాట్లాడే పిల్లలను హింసిస్తున్న ఉపాధ్యాయుల చర్మం వొలవండి!

రెండు వందల యేండ్లు దేశ స్వాతంత్ర్యం కోసం ఎలా పోరాడామో అలా రెండు వందల సంవత్సరాలు ఆంధ్ర భాషా రాష్ట్రం కోసం పోరాడాము. తెలుగు భాషా రాష్ట్రాన్ని సంపాదించుకుంటూ, ఇతర భాషా రాష్ట్రాలు ఏర్పడడానికి దారి కల్పించాం – కానీ ఏ భాష కోసమై రాష్ట్రాన్ని సంపాదించామో ఆ 'అమ్మభాష'ను పెడదారి పట్టించడంలో మనమే ప్రథములమయ్యాం; అధములమయ్యాం.

ఇందుకు ప్రజలను నిందించాలో, ప్రభుత్వాధినేతల్ని నిందించాలో తెలియని సంధిగ్ధస్థితి మనది. ఈ విషయంగా, తెలంగాణా మహాకవి కాళోజీ నారాయణరావు, హెచ్చరికగా చెప్పిన క్రింది పద్యం స్ఫురణకు వస్తున్నది.

**తెలుగు బిడ్డవురోరి తెలుగు మాట్లాడుటకు**
**సంకోచపడియెదవు సంగతేమిటిరా?**
**అన్ని భాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు**
**సకిలించు ఆంధ్రుడా! చావవెందుకురా?**

– ఆయన ముందుగానే తెలుగు భవితను గ్రహించి, ఎన్నో సంవత్సరాల క్రితం హెచ్చరించారు. ఆయన కాలధర్మం చెందినా, ఆ పద్యం మాతృ (ఆంధ్ర) భాషాభిమానుల గుండెల్లో చిచ్చు రగుల్చుతూనే ఉన్నది. ఇదేదో పదవుల కోసం రాష్ట్రాన్ని సంపాదించుకున్నట్టు నాయకులు భావిస్తున్నారేగానీ, వారి మదిలో ఆవగింజంతయిననూ భాషాభిమానం కనిపించుటలేదు.

చిగురుమళ్ళ శ్రీనివాస్‌గారు తెలుగువాళ్ళకు చురక వేస్తూ, మరో పద్యం చెప్పారు!

**తెలుగు నేలబుట్టి తెలుగువారయి మరి**
**తెలుగు మాట మరిచి తిరుగుచుండ**
**కూరుచున్న కొమ్మ కూల్చుటేయగు**
**తెలియచెప్పవయ్య తెలుగువాడ!**

– అన్నారుగానీ ఎవరు ఎవరికి చెబుతారు. ప్రభుత్వం శ్రద్ధ వహించదు; ప్రతిపక్షాలు అసలే పట్టించుకోవు. ఇక గురువుల్లా – కొందరు లఘుబుద్ధితోడ తెలుగు మాట్లాడే పిల్లల మూతులపై వాతలు పెడుతున్నారు. గతంలో ఓ క్రిష్టియన్ పంతులమ్మో, పంతులయ్యో ఈ పని చేసాడని దినపత్రికలు వ్రాసాయ్. కానీ ఆ పంతులమ్మ విశాల భారతంలో క్రైస్తవ మత ప్రచారానికి, తెలుగునే విశ్వసించి 'బైబిలు' ప్రచురించారనే విషయం ఆమె ఎరుగదు. ఇటీవల – మార్చి 8వ తారీఖు ఈనాడు పత్రికలో ఫోటోలతో సహా తెలుగులో మాట్లాడుటయే పాపమా! అనే శీర్షిక క్రింద ఓ తొమ్మిదేండ్ల బాలిక సింగూరి పావని అనే 4వ తరగతి చదువుతున్న చిన్నారిని, తరగతి మధ్యలో తోటి విద్యార్థులతో తెలుగులో మాట్లాడిందని, ఆ స్కూలు ప్రిన్సిపాల్ సత్యనారాయణ వాతలు తేలేలా కొట్టాడనీ, ఈ విషయం గనుక ఇంటిలో చెబితే టి.సి. యిచ్చి పంపేస్తానన్నాడనే భీతితో ఆ చిన్నారి ఈ విషయాన్ని ఇంట్లో చెప్పకుండా బాధను తనలో యిముడ్చుకుని ఉందట. మరునాడు తల్లి పిల్లకు స్నానం చేయిస్తుండగా – చేతిపై ఉన్న దెబ్బలను చూచి నిలదీసి అడగ్గా, ఆ చిన్నారి అసలు విషయం చెప్పింది. ఆరోజు ఎలా ఓర్చుకున్నదో, మాతృభాషా సరస్వతికే తెలిసుండాలి. వెంటనే చిన్నారి తల్లి, తండ్రి పోలినాయుడుకి చెప్పడం, ఆయన స్థానికులతో కలిసి ప్రిన్సిపాలు సత్యనారాయణ నిలదీయడం, అవన్నీ దెబ్బలు కావు పెన్నుతో ఆ పిల్ల గీసుకున్న గీతలని బుకాయించడం, వారంతా (స్థానికులు) కలిసి, పోలీసు రిపోర్టు యిచ్చి పిల్లను, కె.జి.హెచ్ ఆసుపత్రికి తీసుకుని వెళ్ళడంవరకూ గల వార్తా వివరాల్ని 'ఈనాడు' ప్రచురించింది. ఆ 'ఈనాడు' దినపత్రిక వార్తావిశేషాన్ని యధాతథంగా చిత్రాలతో సహా ఉదహరిస్తున్నాం.



## తెలుగులో మాట్లాడటమే పాపమా..!

- చిన్నారిని వాతలు తేలేలా కొట్టిన గురువు
- నిందితుడిపై పోలీసు కేసు

విశాఖపట్నం(తాటిచెట్లపాలెం) - న్యూస్‌టుడే

తరగతిగదిలో తోటి విద్యార్థులతో తెలుగులో మాట్లాడటమే నేరమన్నట్లు ఓ చిన్నారిని పాఠశాల ప్రిన్సిపల్ బెత్తంతో వాతలు తేలేలా కొట్టాడు. విషయం ఇంట్లో చెబితే టీసీ ఇచ్చి పంపేస్తానని బెదిరించాడు. దీంతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కంచరపాలెం బర్మాక్యాంపులో ఉంటున్న సింగూరి పోలినాయుడు కుమార్తె పావని(9) మురళీనగర్ ఎన్.జి.జి.ఓ.స్.కాలనీలో ఉన్న ఎం.ఎస్.ఎం. పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. మంగళవారం తరగతి గదిలో తోటి విద్యార్థులతో సదరు బాలిక తెలుగులో మాట్లాడుతుండడం చూసిన పాఠశాల ప్రిన్సిపల్ ఎం.సత్యనారాయణమూర్తి ఆమెపై మండిపడ్డాడు. బెత్తం తీసుకుని చిన్నారి ఎడమచేతిపై గట్టిగా కొట్టడంతో ఎర్రగా కందిపోయి తట్లుతేలాయి. భయపడ్డ ప్రిన్సిపల్ విషయం ఇంట్లో చెబితే టీసీ ఇచ్చి పంపేస్తానని బెదిరించాడు. దీంతో పావని విషయం ఎవరికీ చెప్పలేదు.

వెలుగు చూసిన వైనం: గురువారం ఉదయం బాలిక తల్లి సుజాత పావనికి స్నానం చేస్తుండగా చేతిమీద వాతలు పెట్టినట్లుగా ఉన్న మచ్చలు చూసి నిలదీయడంతో అసలు విషయం తెలిసింది. తండ్రి పోలినాయుడు స్థానికులతో కలిసి పాఠశాల ప్రిన్సిపల్ సత్యనారాయణమూర్తిని నిలదీశారు. అయితే... తానేమీ కొట్టలేదని, బాలికే పెన్నుతో ఇలా గీసుకుందని ఆయన నిర్లక్ష్యంగా బదులిచ్చారు. దీంతో బాధితులు కంచరపాలెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నార్త్ ఏసీపీ బర్ల ప్రసాదరావు ఆదేశాల మేరకు సీఐ ఎస్.తాతారావు కేసు నమోదు చేసి ప్రిన్సిపల్‌ను అదుపులోకి తీసుకున్నారు. బాలికను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

పాఠశాలలో తెలుగు మాట్లాడినందుకే చిన్నారని చూడకుండా తీవ్రంగా కొట్టి, గాయపరిచిన ప్రిన్సిపల్, పాఠశాలపై తగిన చర్యలు తీసుకోవాలని తండ్రి డిమాండ్ చేశారు. మళ్లీ ఏ పాఠశాలలోనూ ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రిన్సిపల్ సత్యనారాయణమూర్తిపై జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు బాల వికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం బాలలపై దాడి చేయడం నేరమని, నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రిన్సిపల్ చేతిలో దెబ్బలు తిన్న సింగూరి పావని, పాప చేతిపై తట్లు తేరిన దృశ్యం, ప్రిన్సిపల్ సత్యనారాయణమూర్తి

### విద్యాహక్కు చట్టం ప్రకారం పిల్లలను బెత్తంతో కొట్టరాదు

ఇంత దారుణం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉన్న విశాఖపట్టణంలోనే జరిగిందంటే, మారుమూలలనున్న ఆంగ్ల బోధనా పాఠశాలల్లో ఇలాటి దారుణాలెన్ని జరుగుతున్నాయో ఇలాటి దారుణాలు జరుగుతున్న పాఠశాలల్లోని ఉపాధ్యాయులనూ, పాఠశాలల్నూ, వెదికి వెతికి పట్టుకుని నడి వీధిలో నగ్నంగా నిలబెట్టి శిక్షించాలి. అప్పుడే ఇతర పాఠశాలా ఉపాధ్యాయులకు గుణపాఠమవుతుంది.

మాతృభాషను నిర్లక్ష్యం చేస్తున్న అధికారుల ప్రవర్తనను గర్హించాలి. మాతృభాష తెలుగును ఎంత నిర్లక్ష్యం చేసిననూ, మృతభాష కాదు, కానేరదు.

ఇలాటి దుష్ట, దుర్మార్గ, దుర్మతి చేష్టలనూ ప్రతీ విద్యార్థీ, విద్యార్థినుల తల్లిదండ్రులు నిరసిస్తూ, నిరోధించకలిగితే మాతృభాషావికాసమవుతుంది. భాషా రాష్ట్రంగా ఏర్పడి, భాషపై ఆసక్తి చూపని నాయకులూ, పౌరులూ, ఎప్పుడు కళ్ళు తెరుస్తారో అనూహ్యంగా ఉన్నది.

ఎన్ని భాషా సభలు జరిపినా, ఎన్ని నినాదాలు చేసినా ప్రయోజనం లేదు. సభలకు వచ్చేవారు వినోదం కోసమే నన్న తీరూ, సినిమా తారలనూ, రాజకీయ నాయకులనూ చూడవచ్చుననే చింతన మారేవరకూ, ఇటువంటి దుర్నీతి కార్య కలాపాలు జరుగుతూనే ఉంటాయ్. ఇలాటి పాఠశాలలూ, ఉపాధ్యాయులూ విషనాగుల్లా విషాన్ని కక్కుతూనే ఉంటారు.

జై తెలుగు భారతీ! జై విజ్ఞాన వికాస వరప్రసాదినీ! పదహారు కోట్ల తెలుగువారుండీ ప్రయోజనమేఁవిటమ్మా! అలనాటి ముక్కోటి తెలుగు వెలుగులు తిరిగి పుట్టాలమ్మా, మానవత్వామృతం పంచనీ, పెంచనీ మహత్తర తెలుగు భాషని మారుస్తూన్న తెలుగువాడుండీ ప్రయోజనమేఁవిటి తల్లీ!

**చిరతలు పట్టుకుని యెంత పోరెదము**
**భాషా చింతనము సుంతయైన ఉండవలెను సుమ్మీ!** ●

Beautiful City - Beautiful Hotel

DO NOT MISS



Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225




# పేరు ప్రఖ్యాతులు 'స్త్రీ'కి పేర్మి కూర్చవు!

**- ఆత్మ శక్తితో అంతర్రూపిణీయైన శక్తిస్వరూపిణి అమ్మను కొలవండి! -**

భారత స్త్రీలు పుణ్యవతులు. శక్తి స్వరూపిణులు. ధీరమతులు, త్యాగశీలురు. పదవుల కోసం, ప్రఖ్యాతి కోసం, అందంకోసం, ఐశ్వర్యం కోసం పెనుగులాడడానికి మారుగా అంతఃశక్తి స్వరూపిణియైన 'భారతభారతి' ని తలపకపోవడంతో వారు తమ శక్తి శౌర్యాలను కోల్పోతున్నారు. భారతమాతయే దుర్గయనీ, పార్వతియనీ, మహాలక్ష్మియనీ, సరస్వతియనీ ఆర్ష సాంప్రదాయం ఘోషిస్తూన్ననూ విస్మరిస్తున్నారు. శాసన సభాసభ్యురాల్నించీ, రాష్ట్రమంత్రిణి, ముఖ్యమంత్రిణి, కేంద్రమంత్రిణి, పార్లమెంటు అధ్యక్షురాలు, పార్టీల అధ్యక్షురాలు, దేశ అత్యున్నతి పదవియైన 'రాష్ట్రపతి'గా ఎదిగిన శుభ వాతావరణం, స్త్రీ స్వయం రక్షణలో ఎదగలేదు. ఆకాశంలోని మిణుకుమిణుకుమనే తారలుగా ఎదిగిననూ, కోట్లాది ఐశ్వర్యములు తప్ప, అర్థరాత్రిలో నిర్భయంగా నిర్భీతిగా, నిశీధిలో తిరిగెడు స్వయంశక్తీ శౌర్యం, స్థైర్యం కలిగిననాడే స్త్రీ శక్తిస్వరూపిణి కాగలదు. ఆ మంచిరోజు నందన నామ సం॥ములో రాగలదని విశ్వసిద్దాం! స్త్రీలను గౌరవిద్దాం!

**'ప్రముఖాంధ్ర' ఒక్కటే ప్రపంచ దేశ ప్రజల ఉనికినీ, ఉన్నతినీ విశదీకరించే పత్రిక.**
**ప్రముఖాంధ్రను ప్రోత్సహించడం ప్రతీ ఆంధ్రుని బాధ్యత.**

*భారతదేశ స్వరాజ్య పాలనా చరిత్రలోనే రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతులు (డా॥ రాజన్‌బాబు, రాధాకృష్ణ) ఇరువురూ రాజకీయ వాసనలు లేని వారు కావడం, దేశ విదేశీయుల మెప్పు ఒప్పుల వరవడికి నాందీ పురుషులనిపించుకోవడం విశేషం. లోక్‌సభ, రాజ్యసభల నిర్వహణం వీరాకాలంలోనే హుందాగా, ప్రజాస్వామ్య దేశాలకు నాందిగా నిలిచింది. దేశానికి బంగారు భవిష్యద్బాటలు వేసిన రాజకీయ వాసనలంటనివారు. ప్రతిపక్షాల మన్ననలందినవారు.*

*సర్వేపల్లి రాధాకృష్ణన్‌గా పిలువబడినప్పటికీ, తిరుత్తణిలో పుట్టినప్పటికినీ నెల్లూరు జిల్లా సర్వేపల్లి వీరి పూర్వీకుల వాసం. చివరి కాలమంతా ఆయన చెన్నపట్నంలోనే గడిపారు. చెన్నపట్నంలోని స్వగృహంలోనే **1975** సం॥ము ఏప్రిల్ **17**వ తేదీన చివర శ్వాసను విడచారు. తమిళనాడు ప్రభుత్వం ఆయనున్న విశాల వీధికి డా॥ రాధాకృష్ణన్‌సాలై (రోడ్డు) యనే గౌరవపూర్వకమైన స్మారకనామాన్ని ఇప్పటికి కొనసాగిస్తూనే ఉన్నది. (ఇహ విషయాలన్నీ సుప్రసిద్ధ రచయిత జానమద్ది హనుమచ్ఛాస్త్రి గారీ వ్యాసంలో చదవండి)*



# తొలి ఉప రాష్ట్రపతీ, మలి రాష్ట్రపతీ సర్వేపల్లి రాధాకృష్ణ!

దక్షిణ భారతదేశంలోని సుబ్రహ్మణ్యస్వామి వెలసిన క్షేత్రం పుణ్యక్షేత్రం తిరుత్తణిలో ఒక జమీందారు వద్ద చిన్న ఉద్యోగి వీరస్వామయ్య. ఆయన సతీమణి సీతమ్మ దంపతులకు ఐదుగురు కుమారులు ఒక కూతురు. సంతానంలో రెండవ కుమారుడుగా రాధాకృష్ణ జన్మించారు. సీతమ్మ శ్రీకృష్ణుని భక్తురాలు. అందుకే శిశువుకు రాధాకృష్ణ అని నామకరణం చేశారు రాధాకృష్ణ 1888 సెప్టెంబర్ 5న జన్మించారు. వీరస్వామి పూర్వీకులు నెల్లూరు జిల్లా సర్వేపల్లి నుండి అచటి కరువు కాటకాల కారణంగా తిరుత్తణి చేరారు.

రాధాకృష్ణ చిన్నవయస్సు నుండి అంత ఆరోగ్యవంతుడు కాడు. పీలగా వుండేవాడు. కానీ అసాధారణమైన తెలివితేటలుగలవాడు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదివాడు. పై చదువుకోసం సమీపంలో తిరుపతి చేరారు. రాధాకృష్ణ తిరుపతిలోని ఎవాంజిలకల్ పాఠశాలలో చేరాడు. పాఠశాల ఉపాధ్యాయులు రాధాకృష్ణ మేధాశక్తిని గమనించారు. రాధాకృష్ణ కుటుంబ పరిస్థితులు తెలుసుకొని విద్యార్థి వేతనం అందించారు. తిరుపతిలో వున్నప్పుడు సదా చదువులలో నిమగ్నుడుగా ఉండేవాడు, తోటి విద్యార్థులతో ఎక్కువగా మాట్లాడేవాడు కాడు. ఆటపాటలలో ఆసక్తి అంతగా వుండేది కాదు.

తిరుపతిలో నాలుగేళ్లు చదివారు. తర్వాత తండ్రి తన బంధువు వెల్లూరు పాఠశాలలో ఉపాధ్యాయుడుగా వున్నందున రాధాకృష్ణను అక్కడి మిషన్ పాఠశాలలో చేర్చాడు.

పదిహేను సంవత్సరాల వయసులోనే రాధాకృష్ణ మొత్తం మద్రాసు విశ్వ విద్యాలయంలో సర్వప్రథముడుగా ఉత్తీర్ణుడైనాడు. కళాశాలలో వున్నప్పుడే బైబిల్‌ను బాగా చదివారు. కళాశాల పెద్దలు బైబిల్‌లో అతని ప్రజ్ఞను మెచ్చుకొని విద్యార్థి వేతనం వంద రూపాయలు ఇచ్చేవారు. పుస్తకాలు ఇతర ఖర్చులు పోగా, తనకన్నా బీదలైన విద్యార్థులకు కొంత పైకం ఇచ్చేవాడు. అక్కడ ఎఫ్.ఎ. చాలా మంచి మార్కులతో 1904లో ఉతీర్ణులైనారు. బి.ఏ.లో శరీర విజ్ఞానశాస్త్ర ప్రత్యేక పాఠ్యాంశంగా చదవాలనుకొన్నారు.



బి.ఏ. చదవాలంటే చాలా పుస్తకాలు కొనాలి. అంత డబ్బు లేదు. బంధువుల అబ్బాయి అప్పటికే బి.ఏ. పూర్తిచేశాడు. అతని నుండి తత్త్వశాస్త్ర గ్రంథాలన్నీ ఉచితంగా అందుకొన్నారు.


ఎం.ఏ. చదువ నిశ్చయించి, కుటుంబాన్ని ఆదుకోడానికి ప్రైవేట్ ట్యూషన్ ద్వారా నెలకు పాతిక రూపాయలు ఆదాయంతో కొంతవరకు తోడ్పడుతూ, 1909లో ఎం.ఏ. పూర్తిచేశారు. కొందరు మిత్రులు ఆక్స్‌ఫర్డ్ లేదా కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో చేరమన్నారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి వెళ్తే విద్యార్థిగాగాక అధ్యాపకునిగానే వెళ్తాను అన్నారు ఆ చిన్నవయసులోనే!

1909లో ఎం.ఏ. తత్వశాస్త్రంలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడు కావడంతో ఉద్యోగ ప్రయత్నం చేశారు. 1911లో మద్రాసులోని ప్రెసిడెన్సీ కాలేజీలో అడిషినల్ ప్రొఫెషర్ ఉద్యోగంలో చేరారు. ఆయన బోధనా పటిమను గమనించి ఇతర విషయాలు చదివే విద్యార్థులు కూడా రాధాకృష్ణ పాఠాలను వినడానికి వచ్చేవారు. రాధాకృష్ణన్ గురువు హగ్గు గొప్ప ఉపాధ్యాయుడుగ పేరుగాంచిన వాడు. తన విద్యార్థులు కూడా రాధాకృష్ణన్ పాఠాలు వినడానికి వెళ్ళటం గమనించి ఎంతో ఆనందించేవారు.

రాధాకృష్ణ ప్రాచ్య, పాశ్చాత్య, తాత్విక గ్రంథాలను భగవద్గీత, ఉపనిషత్తులు, బౌద్ధ, జైన మత గ్రంథాలన్నిటినీ లోతుగా అధ్యయనం చేశారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని అనంతపురం, రాజమండ్రి ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేశారు. 1918లో అప్పుడే ఏర్పడిన మైసూరు విశ్వవిద్యాలయంలో దర్శనాచార్యులుగా నియమింపబడినారు. 1921లో కలకత్తా విశ్వవిద్యాలయ కులపతి, మహామేధావి అశుతోష్ ముఖర్జీ రాధాకృష్ణన్‌ను తమ విశ్వవిద్యాలయంలో ఆచార్య పదవిస్తూ ఉత్తర్వులు పంపారు. కలకత్తా విశ్వవిద్యాలయం గొప్ప ఖ్యాతిగలది. తమ ఆచార్యుడు కలకత్తా వెళ్తున్న విషయం తెలుసుకొని, మరికొంతకాలం మైసూరులోనే వుండమని వేడుకొన్నారు. కాని కలకత్తా వెళ్ళడానికి రాధాకృష్ణ నిశ్చయించుకొన్నట్లు చెప్పారు.

మైసూరు విశ్వవిద్యాలయం విద్యార్థులు తమ ఆచార్యునికిచ్చిన వీడ్కోలు చరిత్రకెక్కింది. మైసూరు నగరవీధులను పూలమాలలతో అలంకరించారు. గురుశిష్యుల అనుబంధం ఎంత దృఢమైనదో ఎంత ప్రేమాభిమానపూర్ణమైనదో చెప్పనలవి కానిది. విశ్వవిద్యాలయం నుండి తమ ఆచార్యులను గుర్రపు బగ్గీలో కూర్చొండజేసి నగరవీధులలో బగ్గీని స్వయంగా లాక్కొని తీసుకొని రైల్వేస్టేషన్ వరకు వెళ్ళారు. తమ ఆచార్యుడున్న రైల్వేబోగిని పుష్పమాలలతో అలంకరించారు. దిక్కులు పిక్కడిల్లేటట్లు తమ గురువుగారికి సజల నయనాలతో వీడ్కోలు పలికారు. రాధాకృష్ణన్ విద్యార్థుల ప్రేమాభిమానాలను గుండెనిండా నింపుకొని వెళ్తూ బోగినుండి చేతులుపుతూ వుండగా రైలు కదిలింది.

మైసూరులో వుండగా తొలిసారి రవీంద్రనాథ్ టాగూర్‌ను కలుసుకొన్నారు. టాగూర్ వ్యక్తిత్వం పట్ల ఆకర్షితులై 'ది ఫిలాసిఫీ ఆఫ్ టాగూర్' అన్న గ్రంథాన్ని రచించారు. 'రీజన్ ఆఫ్ రెలిజన్ ఇన్ కాంటెంపరరి ఫిలాసఫి' అన్న గ్రంథాన్ని రచించారు. ఈ గ్రంథాలు స్వదేశంలోనే కాక విదేశాలలో కూడా ఆలోచన రేకెత్తించాయి. రాధాకృష్ణన్ తన ఇంటి దగ్గర చదువుకోడానికి వచ్చే విద్యార్థులను ప్రేమతో పలుకరిస్తూ స్వయంగా తేనీరు అందించి వారిని తత్వశాస్త్రగహన అధ్యయయనం



కొనసాగించారు. చదివే సమ యంలో ఆయన మేజాబల్లలు కుర్చీలు వాడు కొనేవారు కాదు. ప్రక్కమీద పడుకొని చదువు కొనటం ఆయన అలవాటు. అవి శ్రాంత అధ్యయనం వల్ల ఆయ నకు 'ఇన్‌సోమ్నియా' (నిద్రలేక పోవటం) వ్యాధి పుట్టుకొనింది.

1925లో కలకత్తాలో భారత జాతీయ కాంగ్రెస్‌ను వార్షిక మహా సభ జరిగింది. భారత తత్వ కాంగ్రెస్ అధ్యక్షుడుగా రాధా కృష్ణన్ ఎన్ను కొన్నారు. మాంచెస్టర్ కళాశాల ప్రధాన ఆచార్యుని ఆహ్వానంపై రాధాకృష్ణన్ ఆక్స్‌ఫర్డ్ కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయాలలో ఉపన్యాసాలిచ్చారు. ఇంగ్లండులో ఆయన ఉపన్యాసాలను అధిక సంఖ్యాకులు ఎంతో ఆసక్తితో విన్నారు.

ఆతర్వాత 1931-36 మధ్య ఆంధ్ర విశ్వవిద్యాలయ కులపతిగా పనిచేసి హిరేన్ ముఖర్జీ హుమయూన్ కబీర్ వంటి గొప్ప మేధావులను విశ్వవిద్యాలయ ఆచార్యులుగా నియమించారు. అయిదు సంవత్సరాలలో విశ్వవిద్యాలయాన్ని మహోన్నతంగా తీర్చిదిద్దారు. 1936 నుండి 1939 వరకు ఆక్స్‌ఫర్డ్‌లో తాత్కాలిక ఒప్పందం పని చేయవలసి వచ్చింది. ఆక్స్‌ఫర్డ్‌లో ఆరునెలలే కలకత్తా విశ్వవిద్యాలయంలో ఆరునెలలు పనిచేసేవారు. 1939లో స్వదేశం వచ్చారు. పండిట్ మదనమోహనమాలవ్యాగారి కోరికపై వారణాసి విశ్వవిద్యా లయంలో కొంతకాలం కులపతిగా పనిచేశారు.

1923లో భారతీయ తత్త్వశాస్త్రం మొదటి సంపుటం, 1927లో రెండవ సంపుటి వెలువడినాయి. 1926లో రాధాకృష్ణన్ హైందవ దృష్టిలో జీవితం (The Hindu view of Life) ఆ తర్వాత మనకు అవసరమైన మతం (The Religion we need) ప్రకటించారు. 1932లో నెహ్రూ కోరికపై భారతీయ ఆత్మ (The Freedom of Hinduism) ఆదర్శవాది దృష్టిలో జీవితం ప్రాచ్య పాశ్చాత్య మతాల సంస్కృతి స్వాతంత్ర్యం గ్రంథాలు రచించారు.

1949లో రాధాకృష్ణన్ భారత రాయబారిగా రష్యా వెళ్ళారు. అంతకు ముందు మన దేశ రాయబారిగా ఉన్న విజయలక్ష్మి పండిట్. ఆరునెలలో ఆ పదవిని వదులుకొని ఆమె స్వదేశం చేరడంతో రాధాకృష్ణన్‌ను నియమించారు.

రష్యా అధినేత స్టాలిన్ విదేశ రాయబారులను చులకనగా చూసేవారు. ఏ రాయబారిని కలుసుకొననివాడు ఒకమారు ఎప్పుడూ పడకమీద చదువు రాతలు సాగించే భారత రాయబారిని చూడాలని ఆశించారు. అనువాదకుడు పావ్లోవ్‌ను పంపి తన కోరికను తెలుపమన్నాడు. ఇద్దరూ కలుసుకొన్నారు. "రాయబారి గారూ! ఇతర రాయబారుల శాంతిని గురించి మాట్లాడుతున్నారంటే యుద్ధాన్ని గురించి ఆలోచిస్తున్నారని అర్థంగా భావించేవాడిని అన్నాడు స్టాలిన్. కాని ఉక్కుమనిషి స్టాలిన్ సాధారణ రాయబారుల కంటే అతీతంగా మాట్లాడారు. రాధాకృష్ణన్‌తో మాట్లాడుతూ "నన్ను మనిషిగా గౌరవించిన ప్రథమ వ్యక్తి మీరే. మీరు త్వరలో మా దేశం వదలిపోతున్నందుకు బాధగా వుంది. నేను ఎక్కువకాలం జీవిస్తానన్న ఆశలేదు. కాని మీరు (రాధాకృష్ణన్) మాత్రం చిరకాలం వర్ధిల్లాలని కోరుకొంటాను అన్నాడు. బల్లకు అటువైపు కూర్చున్న స్టాలిన్ లేచి వచ్చి రాధాకృష్ణన్‌తో స్నేహపూర్వకంగా కరచాలనం చేశాడు. ఈరీతిగా రష్యా భారతదేశాల మైత్రీ బంధాన్ని దృఢం కావించారు రాధాకృష్ణన్. రాధాకృష్ణన్ 1952లో ఉపరాష్ట్రపతిగా ఎన్నుకోబడి 1962 వరకు ఆ పదవిలో కొనసాగారు. అనేక దేశాలు పర్యటించారు. చైనాలో మావోను కలుసుకొన్నారు.

**వైవాహిక జీవితం** :

వెల్లూరులో పాఠశాల విద్యార్థిగా వున్నప్పుడే రాధాకృష్ణన్ వివాహమైంది. అప్పుడతని వయసు పదునారేళ్ళు మాత్రమే. వధువు శివకాము, తండ్రి రైల్వేలో ఉద్యోగం చేస్తూ కాలం చెందాడు. తల్లి నిస్సహాయురాలైంది. అప్పటికి శివకాము. అమ్మాయి వయసు పదేళ్ళు. వివాహం నిరాడంబరంగా జరిగింది. రాధాకృష్ణ ఆమెను 'పద్మ' అని పిలిచేవారు.

వారి దాంపత్య జీవితం ఎంతో అన్యోన్యంగా సాగింది. భార్య సమర్థత మీద రాధాకృష్ణ కెంతో విశ్వాసముండేది. ఆమె అల్పసంతోషి. ఆ దంపతులకు ఒక కుమారుడు ఐదురు కుమార్తెలు జన్మించారు. కుమారుడు సర్వేపల్లి గోపాల్ ప్రముఖ చరిత్రకారుడుగా పేరు గడించారు. రాధాకృష్ణ వివిధ కార్యక్రమాల్లో తలమునకలవుతూ కుటుంబ విషయాల మీద దృష్టి సారించేవారు కాదు. ఆమెకు నలభై సంవత్సరాల వయసులోనే 1937లో కంటిచూపు మందగించింది. రెండవ కంటికి కూడా ఢిల్లీలో ఆపరేషన్ చేయించారు. కొద్దిపాటి చూపు మాత్రమే మిగిలింది. 1956లో ఆమెకు రక్తపోటు పెరిగి, క్రమంగా గుండెపోటుగా మారింది. భర్త విదేశాల్లో పర్యటిస్తూ దేశాధినేతల ప్రశంసలందుకొంటున్నారు. టోక్యోలో వుండగా భార్య ఆరోగ్యం బాగాలేదని విని వెంటనే మద్రాసు వచ్చారు. ఢిల్లీ, మద్రాసుల మధ్య ప్రయాణాలు చేస్తూన్నారు. ఒకసారి ఆమెను చూచి మరలా ఢిల్లీ వెళ్ళిన ఒకసారి ఢిల్లీ వెళ్ళిన వెంటనే నవంబరు 26వ తేది 1956న ఆమె తుదిశ్వాస వదిలారు. ఆ దుర్వార్త విన్న వెంటనే మద్రాసుకు వచ్చి ఆమె అంత్యక్రియలను స్వయంగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. భార్యా వియోగంతో ఆయన అంతర్ముఖులయ్యారు. ఆమె పెద్ద చదువులు చదవలేదు. భారత భాగవత రామాయణాలను బాగా చదివిన ఇల్లాలు కలకత్తాలో వున్నప్పుడు రాధాకృష్ణన్ ఆమె ఆంగ్ల భాష నేర్పడానికి ఒక ఉపాధ్యాయుని ఏర్పాటుచేశారు.

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత తొలి రాష్ట్రపతిగా బాబు రాజేంద్రప్రసాద్ ఎన్నికైనారు. ఆయన రైతువలె సాధారణంగా వుండేవారు. 1957 నుండి 1962 దాకా రాజేంద్రప్రసాద్ రాష్ట్రపతిగా విధులను నిర్వహించారు. రెండవమారు కూడా ఎన్నుకోబడి 1962 వరకు దేశాధ్యక్షులుగా సేవలందించారు. 1962లో భారత రాష్ట్రపతి ఎన్నిక జరిగింది. కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షాలన్నీ రాధాకృష్ణన్ అభ్యర్థిత్వాన్ని సమర్థించాయి. రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా ఎన్నుకోబడినారు. రెండవసారి కూడా రాష్ట్రపతి అయ్యారు.

రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా వున్నప్పుడు రెండుసార్లు మనదేశంపై చైనా ఆ తర్వాత పాకిస్తాన్ దాడిచేశాయి. ఉద్రిక్త సమయంలో రాధాకృష్ణన్ ప్రతిరోజూ దేశ రక్షణ విషయాలపై చర్చించేవారు. దేశం క్లిష్ట పరిస్థితులు, రాధాకృష్ణన్ ఎంతో విజ్ఞతతో వ్యవహరించారు.

1931లో బ్రిటిష్ ప్రభుత్వం, రాధాకృష్ణన్‌కు 'సర్' బిరుదుతో సత్కరించింది. 1954లో, భారత ప్రభుత్వం దేశంలోని అత్యున్నత పురస్కారమైన 'భారతరత్న' బిరుదుతో గౌరవించింది. అమెరికా అధ్యక్ష భవనంలోనికి హెలికాప్టర్ ద్వారా ప్రవేశించిన ఒకే ఒక దేశాధ్యక్షుడు రాధాకృష్ణన్. కెన్నడీ చమత్కారంగా మీరు ఏ మహర్షుల గురించి ప్రపంచానికి చెప్పారో ఆ మహర్షి మీరే! అంటూ ప్రశంసించాడు. విద్యారంగానికి ఆయన చేసిన సేవలను గుర్తించి, ఆయన జన్మదినాన్ని గురుపూజోత్సవంగా దేశం జరుపుకుంటున్నది. హిందీని జాతీయ భాషగా ప్రకటించినవారు రాధాకృష్ణన్‌గారే.

ప్రపంచ దేశాధినేతలు, ప్రపంచ మేధావులందరి మన్ననలందుకొన్న బ్రహ్మ విద్యాభాస్కర్, రాజర్షి, సర్వేపల్లి రాధాకృష్ణన్ మద్రాసులోని స్వగృహంలో 17.04.1975 ప్రభాత సమయాన ఇహలోకం చాలించిన వారి స్మారకదినాన్ని పురస్కరించుకుని ఈ వ్యాసాన్ని ప్రచురించడమైనది.

– జానమద్ది హనుమచ్ఛాస్త్రి

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels.yahoo.co.in, Grams : "MAYURA"**

**'ప్రముఖాంధ్ర' ఒక్కటే ప్రజల పత్రిక. వెబ్ ఎడిషన్ చదివి ప్రముఖాంధ్ర ప్రత్యేకత గ్రహించండి!**

# ఎండిన కర్రను జీవకళ ఉట్టిపడే బొమ్మగా మలిచే 'నిర్మల్' కళా నిపుణులు!

## చిత్రం భళారే విచిత్రం!



'బొమ్మను చేసీ, ప్రాణము పోసీ' యనే తెలుగు చిత్రం పాటను వింటున్నపుడు 'నిర్మల్' కళాకారులూ, కొండపల్లి బొమ్మలూ స్ఫురణకువస్తాయ్.

తెలంగాణాలోని ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ గ్రామం ఈ కొయ్య బొమ్మల తయారీకి పెట్టింది పేరు. నాలుగు దశాబ్దముల క్రితం నిర్మల్‌ను నిమ్మనాయుడు పరిపాలించే వాడు. నాయుడు మంచి కళాభిమాని. స్వయంగా కళానైపుణ్యం కలవాడు. చిత్రకళకూ, కొయ్యబొమ్మల తయారీకి అతడెంతో ప్రోత్సాహమిచ్చాడు. నిర్మల్ బొమ్మలకు అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చినవాడు నాయుడే!

ఆ రోజుల్లో రాజస్థాన్ నుంచీ కొన్ని కుటుంబాలు నిర్మల్‌కు వలస వచ్చాయ్. వారు ఇంటికి ఉన్న వాసాలూ, ద్వారబంధాలపై చక్కని జీవమున్న బొమ్మలను చిత్రించే వారు. వారి కళానిపుణతను చూచి నిమ్మనాయుడు వారిని మెచ్చుకోవడమే కాకుండా కొయ్య బొమ్మలను తయారుచేసే పనిని ప్రోత్సహించారు. అక్కడ ఆ బొమ్మలకు పనికి వచ్చే పొనికి కర్ర లభించేది. ఆ కర్రను ఏ విధమైన ఆకృతికైనా మలుచుకొనేందుకు తగిన కర్రగా తోచింది. అందరూ ఆ కొయ్య బొమ్మల వృత్తిపై దృష్టిని లగ్నపరిచారు.

దానినొక పరిశ్రమగా గుర్తించి, 1955లో జిల్లా పరిశ్రమల కేంద్రం సహాయంతో నిర్మల్ కొయ్య బొమ్మల సంఘాన్ని ఏర్పాటుచేశారు.

కర్ర ఒక్కటే వారికి 'జీవగర్ర'. 'బొమ్మను చేసీ ప్రాణము పోసీ' అన్న సినిమా పాట చందంగా – కొయ్యను అందంతో తీర్చిదిద్దగల పనివారు అక్కడే ఉన్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో, ఎన్నో రూపాల్లో బొమ్మలు చెక్కగల పనివారలు అక్కడే ఉన్నారు.

బొమ్మ తీరును బట్టీ, పనితనాన్నిబట్టీ, రంగుల మేళవింపును బట్టి, పరిమాణమును బట్టి – ఆ బొమ్మలు 20 రూపాయల్నుంచీ వేల రూపాయల వరకూ విక్రయింపబడుతున్నాయ్. దేవుళ్లు, దేవతలు, పక్షులు, జంతువులు, పళ్లు, పల్లెరాల్లో ఫలాలు వంటి ఎన్నిటినో వారు తయారుచేస్తున్నారంటే సాధారణ విషయం కాదు. ఉలిపట్టిన శిల్పి, నల్లరాయి, చలువరాతుల్లో ఎన్ని రకాల దేవతా మూర్తులను రూపొందిస్తున్నారో, నిర్మల్ కళాకారులూ ఆవిధంగానే రూపొందిస్తారు. శిల్పులకు రంగులు వేసే పని ఉండదు. వీరు ఆ రంగుల అలంకరణను ఆ కర్ర బొమ్మలపై తీసుకొని రావడంతో ఓ ప్రత్యేకమైన చిత్ర కళాపరిజ్ఞానం వారిలో నిక్షిప్తమై ఉన్నది.

తొలుత వారు సహజమైన రంగులనే బొమ్మలకు వేసేవారు. తెలుపు రంగు కోసం గవ్వలు, పసుపు రంగు కోసం పసుపు, ఎరుపు రంగు కోసం మోదుగ పువ్వులు, నలుపు రంగు కోసం దీపంపై పల్లెరాన్నో, పాత్రనో పెట్టి, కాటుకలాంటి ఓ నల్లని మసిని తీసి ఉపయోగించేవారు. ప్రస్తుతం డెకో పెయింటింగ్ రావడంతో జిగేల్ జిగేల్మంటూ ఎప్పటికీ కాంతులు కోల్పోని విధంగా కొయ్య బొమ్మలను తయారుచేయడం ప్రారంభించారు.


అజంతా శిల్పాల్లా వారు రాతిలో చెక్కిన చిత్రాలు కూడా చెక్కు చెదరకుండా ఉంటున్నాయ్. మహారాష్ట్రలోని పాలజ్‌లో కల గణేష్ విగ్రహాన్నే ఉదాహరణంగా కనిపిస్తున్నది. 60 సం॥ల క్రితం తీర్చిదిద్దిన ఈ విగ్రహం ఇప్పటికీ భక్తులను ఆకర్షిస్తూ, ముడుపులూ, మొక్కుబడులూ, పూజలూ జరిపించుకుంటూంది. వారి పెయింటింగులు కూడా సంవత్సరాల తరబడి, వసి వాడకుండా ఉంటున్నాయ్.

వీరు కర్రబొమ్మలకు వాడే కర్రను 'పొనికి కర్ర' అంటారు. అదిలాబాద్ నుంచీ మంచిర్యాల మధ్యనున్న అడవుల్లోనూ, బెల్లంపల్లి, జన్నారం ప్రాంతాల్లోనూ గల వృక్షాల నుంచీ ఈ కర్ర లభిస్తున్నది. అది నేలసారమో, ఆ కళాకారుల అదృష్టమో గానీ, ఆ కర్ర మరెక్కడా లభించడం లేదు. ఈ కర్ర గల వృక్షాలను పెంచాలని బెంగుళూరులో ఎన్నో ప్రయత్నాలు చేసారు, ఎన్నో పరిశోధనలు చేశారు. కానీ పరిశోధనలు పరిశోధనలుగానే నిలిచిపోయాయి కానీ ఫలించలేదు.

నాలుగు దశాబ్దాల చరిత్ర కలిగిన యీ కొయ్య బొమ్మల కుటీర పరిశ్రమ లక్షల కొలదీ రూపాయల వ్యాపారాన్ని చేయిస్తున్నది. 'నిర్మల్'లోని పనివారలు తయారుచేసిన బొమ్మలకే ఈ ప్రత్యేకత, గిరాకీ!

ఆంధ్ర ప్రాంతంలోని కృష్ణా జిల్లాలో విజయవాడకు అనతి దూరంలో ఉన్న కొండపల్లిలో కూడా కర్రబొమ్మల తయారీ ఉన్నది. కన్నులను మిరిమిట్లు గొలిపే విధంగా, రాధాకృష్ణ, రామ, సీతాసమేత లక్ష్మణ భరత హనుమత్సమేత రామ పరివారం బొమ్మలూ, ఏనుగపై అంబారీ, గీతోపదేశం బొమ్మలెంతో సువిఖ్యాతిని పొందాయ్. యాంత్రికంగా మారిపోయిన మన దేశంలో ప్రభుత్వం యీ చేతి పనులకు పనివారలకూ ప్రోత్సాహమిస్తే ఎంతో సముచితంగా ఉంటుంది. చేతిపనివారలను ప్రోత్సహించినట్లూ ఉంటుంది. ●








# ఆయ్, నే రాజమండ్రి ఎళ్లి గోదారి గట్టుకెళ్ళానండి.

జీ.వి. రావ్

రాజమండ్రి ఆ పేరు చెపుతూంటే నా మనస్సు హాయిగా వుంటుంది. మా అమ్మ ఆ వూరి గురించి ఎప్పుడూ చెపుతూ వుంటారు. ఆవిడకిష్టమైన వూరు. మిగిలిన వారి సంగతి తెలీదుకాని మా వెంకటేశుకి బంధుప్రీతి వుందే అని అమ్మ, పిన్నుల (పినతల్లుల)తో చెపుతూ వుండేది. ఈమధ్య నేను రాజమండ్రి పిన్ని కూతురు పెళ్ళికి, చిన్నతిరుపతి ద్వారకా తిరుమల పెద్దమ్మగారి మనవని పెళ్ళికి వెళ్ళాను. తెలుగు అంటే ఉభయ గోదావరి జిల్లాల తెలుగుకు ప్రత్యేకత వుంది. ఆ యాస దానికి కారణం. చెన్నై నుంచి సర్కారులో బయలుదేరిన నేను మా బావమరిది రామకృష్ణారావు చెప్పిన విధంగా గోదావరి స్టేషన్లో దిగిపోయాను.

మధ్యాహ్న భోజనానికి రెండు కర్రీలు కొనుక్కుని రూముకొచ్చేసాను. అనుకున్నట్లుగా మావాడు 5.30కు వచ్చేసాడు. రాజమండ్రి ముఖ్యవీధులన్నీ ఇద్దరూ కలిసి తిరిగేసాం. అలా కోటిపల్లి బస్టాండుకు వెళ్ళి అక్కడ వీరేశలింగం పంతులుగారి విగ్రహం. ఆ క్రింద చిలకమర్తి

ఇదేమి చోద్యం.
పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు ఫోటో
వేస్తాడనుకుంటే ఎంత సొంత
పత్రికైతే మాత్రం జీవిరావు బండెక్కి
ఫోజిస్తాడా ఇదికాస్త అతిగా వుందే?



ఎందుకంటే వాడుండే వీరభద్రపురం అక్కడికి దగ్గర. ఉదయం ప్రసిద్ధిగాంచిన ఆ గోదావరి బ్రిడ్జిమీద రైలు వెళ్తూంటే వచ్చే ఆ శబ్దం నా మనసులో ఉత్సాహాన్ని నింపింది. రాజమహేంద్రి అనాలిట. మొదటి రైలు వంతెన, లాంచీల రేవు, పుష్కరాల రేవు, ధవళేశ్వరం ఆనకట్ట ఏవేవో నా మనసులో మెదిలాయి. ఓరేయ్ జీవి అన్న బామర్ది కేక నా ఆలోచనలకు అడ్డుకట్ట వేసింది. నన్ను ఆటోలో ఎక్కించుకొని ఓ రెండస్తుల డాబా ఇంటి ముందు ఆపాడు. 45 ఏళ్ళ వయస్సులో ఆ డాబా ఇంటిపైన రెండు గదుల పోర్షన్‌లో అద్దెకుంటూ, పెళ్ళాం, పిల్లల్ని చెన్నైలో వుంచి వాడు మాత్రం అక్కడ బ్యాచిలర్ జీవితం గడుపుతూ ప్రతి నెలా ఓ మూడు రోజులు చెన్నై వచ్చిపోతున్న బ్యాంక్ హెడ్ గుమస్తా వాడు. నాకు ఒక స్టవ్‌లో వేడినీళ్లు, ఇంకో స్టవ్‌లో కాఫీ కలుపుతున్నప్పుడు మళ్ళీ ఆ వూరి ఆలోచనలు నన్ను ముసురుకున్నాయి. శ్రీనాధుడు రాజమహేంద్రపురమని పిలిచిన వూరు. నన్నయ మహాభారతాన్ని రచించిన రాజమహేంద్రవరం. గోదావరి జిల్లాలో ప్రసిద్ధి చెందిన పట్టణము. మళ్ళీ ఆలోచనలకు అడ్డుకట్ట వేస్తూ కాఫీ గ్లాసు అడ్డు తగిలింది. వాడు ఆఫీసుకు బయలుదేరాలి, మధ్యాహ్నం భోజనం కూడా నాకోసం వండేసి తొందరగా ఆఫీసు నుంచి వచ్చేస్తాను అలా బయటకు వెళ్దాం అంటూ ఆఫీసుకు బయలుదేరి వెళ్ళిపోయాడు కిష్టిగాడు. నేను స్నానం ముగించుకుని అలా వూళ్ళోకి వెళ్దామని, పెసరట్టు టిఫిన్ తిందామని ఆ చుట్టుప్రక్కల వీధులన్నీ తిరిగాను. రాజమండ్రిలో ఎక్కడ చూసినా కర్రీ సెంటర్లే. కాస్త టిఫిన్ తిని

వారి పద్యం. ఆ ఎదురుగా ఆయన పేరుతో వున్న స్కూలు, స్వాతంత్ర సమర యోధుల పార్క్ అలా ఆటోలో ప్రసిద్ధి చెందిన రైలు వంతెన దగ్గరకెళ్ళాం. నా కళ్ళు ఆచుట్టూ గమనిస్తూనే వున్నాయి. రాజమండ్రిని చూస్తే నాకు పూర్తిగా మారిపోలేక సగం మారిపోయి వెనుకటి ప్రాభవాన్ని వదులుకోకుండా, పూర్తిగా మోడ్రనిజానికి మారిపోకుండా అటూ ఇటూ కాకుండా సందిగ్ధావస్థలో వున్నట్లుగా అనిపించింది. మరునాడు ఉదయాన్నే పెళ్ళికి వెళ్ళాలి. పెళ్ళి రాజమండ్రి ప్రక్కన పేరవరంలో. ఉదయాన్నే మా మేనమామ తురగా సుందర శ్రీరామచంద్రమూర్తి దంపతులతో రాజమండ్రిలోని కృష్ణమావయ్య దంపతులతో కలిసి పెరారం వెళ్ళాను. ఇంటిముందు ఆరుబయట అరటితోటలో ముచ్చటైన పల్లెటూళ్ళో పెళ్లి ఎంతటి పల్లెటూరైనా ఊరి మొదటినుంచి డిజిటల్ బ్యానర్లు స్వాగతం చెపుతూ వేదిక దగ్గరకు వెతుక్కోకుండా తీసుకెళ్ళాయి. అచ్చ తెలుగువారి పెళ్ళిలో వుండవలసినన్ని హంగులు కనిపించాయి. కాసేపు కూర్చుని కాఫీ టిఫినులయ్యాక తాళి కట్టే శుభవేళ అయ్యాక ఊరిలో ఒకాయన చేత బండి కట్టించుకొని గోదావరి గట్టుకెళ్ళాం. నేను, మా మావయ్య, అత్తయ్య, శీను, మా పెద్దన్న, బాబయి, పిన్ని. మంచి పుష్టిగా వున్న ఆ రెండెడ్ల బండి మా పదిమందిని సునాయాశంగా ఇసుక పర్ర అయినా ఏమాత్రం అలసట చెందకుండా మమ్మల్ని మోసుకుని గోదావరి పాయదాకా తీసుకెళ్ళింది. అందరు అక్కడ దిగి గవ్వలేరుకునేవారు గవ్వలు, నీటిలో ఆడేవారు నీటిలో సరదాగా ఒక అరగంట వయస్సు వ్యత్యాసాలు మరిచిపోయి గడిపాం. తరువాత పెళ్ళి భోజనం. వధూవరులతో కాసేపు కరచాలనం, అందరికి ఆత్మీయంగా వీడ్కోలు పలికి మళ్ళీ సర్కారులో చెన్నై ప్రయాణం. *(తరువాయి 25వ పేజీలో)*

# అతనికతనుగా ఎదిగి, తన నీడలో ఎందర్నో ఎదిగింపచేసి ఆర్యవైశ్య కులశ్రేష్ఠునిగా ప్రవర్ధిల్లుతున్న ఎం.వి. నారాయణగుప్త



'ఖర'కు వీడ్కోలిస్తూ, 'నందన'కు స్వాగతం పలికిన చందాన కుచేలంబాళ్ కల్యాణవేదిక, కిలోమీటరునున్న ద్వారం నుంచీ కలశ స్థాపనం చేసిన ఇరుద్వారాల వరకూ ఇంద్ర నగరం అమరా వతిలా శోభిల్లుతూంది. వయసు వైశ్యేంద్రుడు ఎం.వి. నారాయణగుప్త షష్టాబ్ది వేడుకలకు షోడశ కళాప్రపూర్ణుడైన శశాం కుడు తన తారలందరితో కూడి వచ్చాడా - అన్న అనూహ్య ఆనందం ఆకాశపుటంచుల్ని తాకింది.

ఖర నామ సంవత్సర చివరి రోజు గురువారం (లక్ష్మీప్రదమైన రోజు) 22 మార్చి, సాయం సమయాన, కలశ పూజ, గణపతి పూజ, సకల దేవతా పూజలతో శ్రీకారం చుట్టిన (మంచి) వైశ్యశ్రేష్ఠుడు నారాయ ణుడి షష్టాబ్ది పూర్తికి చెన్నయ్, రాయలసీమ, తమిళనాడు జిల్లాల నుంచీ బంధుమిత్రులు తరలివచ్చారు. సతీమణితో జ్యోతీ 'నారాయణు'నిగా ఆయన పీఠంమీద కూర్చు న్నాడు. ఆ పీఠం వరకూ బంధు మిత్ర జనం తోసుకుని వస్తూనే వున్నారు. అది ఆయన సంపా దించుకున్న వేరునగోన్నత వాత్సల్యం. గడియారంలోని పెద్ద ముల్లు సెకను సెకనుకూ పైకి వస్తూంది. కానీ ఎం.వి.నారాయణగుప్త పేరు, ప్రసిద్ధి, పదవులు, వైశ్యులకు చేసే సేవలు సెకను కన్నా వేగంగా అభివృద్ధి చెందాయ్.

ముందు (ఖర నామ చివరి) రోజున వైదికయుక్తంగా కలశ స్థాపన, గణపతి పూజ, సకల దేవతారాధన, దంపతుల పూజలో షడ్రషోపేత విందు భోజన మందించి, నందన నామ చైత్ర శుద్ధ పాఢ్యమి, శుక్రవారం గోపూజ, హోమం, పూర్ణాహుతి, తీర్థాభిషేకం, మాంగల్యధారణం, మధ్యాహ్న విందునిచ్చి, ఆహూతులను ఆనందాబ్ధిలో ముంచెత్తివేసారు. 'ప్రముఖాంధ్ర' ఎం.వి. నారాయణ, జ్యోతి దంపతులను పట్టు వస్త్రాలతో ఆశీర్వదించి, ఆచంద్ర తారార్కమూ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో తులతూగాలని ఆశీర్వదించింది. ●



తమిళనాడు గవర్నరు రోశయ్య సతీసమేతంగా వచ్చి ఆశీర్వదించారు.

*(24వ పేజీ తరువాయి)*

మళ్ళీ వారం తిరక్కుండా ద్వారకా తిరుమలలో మా బాబ్జి అన్నయ్య (పెద్దమ్మగారి అబ్బాయి) కొడుకు పెళ్ళి. మళ్ళీ అదే ఉత్సాహంతో చెన్నై నుంచి వెళ్ళాను. ఆ ద్వారకా తిరుమల వేంకటేశ్వరుని గురించి ఎన్నో విశేషాలు విన్నాను. మా పత్రికలోనే రాశాము. అక్కడ రెండు రోజులున్నాను. పెళ్ళి ఆర్యవైశ్య సత్రంలో. ఉదయం స్వామివారి సుప్రభాత దర్శనం. జరగండి, వెళ్ళండి అనే తోపులాటలు లేకుండా ప్రశాంతంగా ఆయన ఎదురుగా 30 నిమిషాలు కూర్చొని ఆయనకు ఏకరువు పెట్టవలసినదంతా చెప్పి, తృప్తిగా బయటకు వచ్చాను. ఇంక పెళ్ళి తంతు. ఎప్పుడో చిన్నప్పుడు చూసిన పిల్లలు ఇప్పుడు ఎదిగి మావయ్యా, బావయ్యా, బాబయ్యా అంటుంటే అప్పుడే పెద్దవాళ్ళం అయిపోయామా అనే బాధ. మనం చేసిన చిలిపి పనులన్నీ ఇప్పుడు వాళ్ళు చేస్తూంటే ఆనందం. అన్నీ కలిసి రెండు పెళ్ళిళ్ళు సరదా ఒక వందరోజుల సినిమా చూసినంత ఆనందం కలిగించింది. ఇది రాశాక పెళ్ళి గురించి నా మదిలో మెదిలిన కొన్ని మాటలను కాగితం మీద పెట్టాలనిపించింది.

**పెళ్ళంటే...**

**రెండు జీవితాలు కలిసి ఒక్కటైన రోజు**
**కన్నవారి కలలు నిజమైన రోజు**
**బంధుమిత్రులు రెట్టింపైన రోజు**
**ఆకాశాన్నంటే పందిళ్ళు, భాజా భజంత్రీలు**
**బంధుమిత్రుల సందళ్ళు, పెద్దవారి హడావిళ్ళు**
**చిన్నపిల్లల అల్లర్లు, పంతుళ్ళ వేదమంత్రాలు,**
**ఆడవాళ్ళ నగల హొయలు,**
**వంటవాళ్ళ ఘుమఘుమలు,**
**అందరి వదనాల్లో సంతోషాలు**
**నూతన దంపతుల సిగ్గుదొంతర్లు**
**తలంబ్రాల ముచ్చట్లు, పూబంతులాట**
**ఉంగరాల ఆట, సప్తపదులు అన్నీ ముచ్చట్లయ్యాక**
**అప్పగింతలలో ఆనందభాష్పాలు**
**ఇదీ వివాహ వేడుక.** (అయ్యబాబోయ్ నాకు కూడా కవితొచ్చేసింది)

నేను వెళ్ళిన ఈ రెండు వివాహ వేడుకలు, నేను చిన్నప్పుడు పారేసుకున్న ఆనందాన్ని మళ్ళీ నాకిచ్చాయి. ●

## తస్మాత్ జాగ్రత్త

ప్రపంచంలో నానాటికీ కృత్రిమ, అంటే మానవునిచే రూపొందించబడే సౌఖ్యాలు ఎక్కువైపోతున్నాయి. ప్రతి ఇంట్లో ఏ/సిలు ప్రతివాడికీ కారు, ప్రతి ఇంట్లో ఎన్నో విద్యుదుపకరణాలు, ప్రతి పని మోటారుల చేత చేస్తూ వుండడం మూలాన కృత్రిమంగా తయారయ్యే ఊర్జ. ఎక్కువగా కావలసి వస్తోంది. దీని ఉత్పత్తి క్రమంలో రోజు రోజు కూడా పెరిగిపోతున్న కార్బనద్విఆమ్లము (కార్బన్ డయాక్సైడ్) పెరిగిపోతుంది. ఇలా పెరిగితే సముద్రం మీద, భూమిమీద, పర్వతాల మీద వున్న మంచు అంతా కరిగి సముద్రం యొక్క మట్టము పెరిగిపోతుంది. ఎన్నో ద్వీపాలు తటవర్తన నగరాలు మునిగిపోతాయి. ఊర్జా గ్రహణమును నిరోధిస్తేనే వాతావరణ ఉష్ణోగ్రత తగ్గగలదు.

— డా॥ త్రిపురనేని హనుమాన్ చౌదరి

# జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

వివిధ మత-శాఖల మధ్య జరిగే పోరాటం, మతమంటే వారికి అసలు తెలియదనే నిజాన్ని వెల్లడి చేస్తుంది. వారికి మతమంటే పుస్తకాల్లో రాయడానికి వచ్చే పైపై మాటలే.

- స్వామి వివేకానంద



మూడు నెలలుగా ప్రముఖాంధ్రలో జీవిరావ్ పేజీ రాయలేదు. ఏదో పనుల ఒత్తిడి వల్లనూ, కొన్ని చికాకుల వల్లను ముఖ్యంగా నేనేమి ఫుల్ టైమ్ రైటర్‌ని కాను, పార్ట్‌టైమ్ రైటర్‌ని. కాబట్టి ఎక్కువగా దృష్టిపెట్టి రాయలేకపోయాను. కాని ఏప్రిల్ నెలలో రాసి తీరాలి అని రాస్తున్నాను. కారణం అమ్మ నన్ను విడిచిపెట్టి పైలోకాలకు వెళ్ళినది ఈ ఏప్రిల్ నెలే. నా తల్లి గురించి రాయడం నాకు గర్వంగా వుంటుంది. చదువుకున్న తల్లులకు స్ఫూర్తిదాయంగా వుండవచ్చు, మరికొంతమందికి అతిగా వుండవచ్చు. ఇంకొంతమందికి కంటగింపుగా వుండొచ్చు. ఏది ఏమైతేనేమి నేను రాయడం రాయక మానను. తల్లి అంటే తరింపచేసేది. మా అమ్మను గురించి తలుచుకుంటేనే మనస్సుకు ఆనందంగా వుంటుంది, ఆహ్లాదాన్నిస్తుంది, మేనుకి చల్లన, మనస్సుకి హాయి కలుగుతుంది. మా అమ్మ మా ముగ్గురు అన్నదమ్ములను "నాకన్న మీరు నాకు ఎంతో ముఖ్యం" అంటూ ఎంతో అపురూపంగా చూసేది. కంటికి రెప్పలా కాపాడేది. ఎవరికి ఏ కష్టం వచ్చినా, ఎవరికి ఏమి కావలసి వచ్చినా అందరి దేవుళ్లకి తనే మొక్కుకునేది. ఆ మొక్కులు కాస్త కఠినమైనా తనే తీర్చేది. చివరగా మూడు సంవత్సరాలు ఆరోగ్యం బాగా లేనప్పుడు కూడా మా గురించే ఎక్కువగా ఆలోచించేది. అంతటి గొప్ప తల్లి ఇప్పుడు నాచెంత లేకపోవడం నాకు పెద్ద లోటే. పుట్టిన ప్రతివారు గిట్టకపోరు అని వేదాంతం మాట్లాడినా ఇంకొన్ని రోజులు వుంచితే ఆ దేముడి సొమ్మేం పోయింది అనిపిస్తుంది. నేను, నా కుటుంబం, నావాళ్ళు అని ఎంతమంది అనుకుంటారో కాని అమ్మ మాత్రం మా తరువాత నాన్న కుటుంబం వైపు, అమ్మ కుటుంబంవైపు వాళ్ళ బాగోగులు కూడా చూసింది. మేమేమి పెద్ద ఆస్తిపరులు కాకపోయినా ఉన్నదానిలో నలుగురం సర్దుకుందాం అనే ఉన్నతమైన ఆలోచన కలిగిన తల్లిదండ్రులుండడం మా అదృష్టం. ఆ బుద్ధులు కొద్దిగా మా ముగ్గురి అన్నదమ్ములలో వుండడం అమ్మ నేర్పిన గుణం. నావరకూ నాకు సమస్యలు ముంచెత్తి ఉక్కిరి బిక్కిరి చేసినప్పుడు అమ్మ ఫోటో ముందు రెండు నిమిషాలు మౌనంగా నిలబడతాను. అంతా అమ్మకు చెప్పాను. ఇక అమ్మ చూసుకుంటుందిలే అని ఆందోళనను తగ్గించుకుంటాను. అలా నా జీవితంలో అమ్మ జ్ఞాపకాలు ఎన్నో పెనవేసుకుని ఉన్నాయి. అంతటి ఉన్నతమైన తల్లి కడుపున పుట్టడం ఈ జన్మలో నే చేసుకున్న పుణ్యం.

* * *

నాన్నగారు ఎక్కువగా బయటకు వెళ్ళటం లేదు కాబట్టి కొన్ని ముఖ్యమైన సభలకు నేను వెళుతున్నాను. అలాగే ఒక సభకు ఆ నిర్వాహకుల ఆత్మీయ పిలుపు కారణంగా నేను పనులవత్తిడి వున్నా వెళ్ళాను. అదొక పుస్తక ఆవిష్కరణ, సమీక్ష సభ, సభ జరిగే ప్రదేశం విద్యార్థులుండే చోటు. ఆ పుస్తక రచయిత ఆ సభలో చేసినది ఆ పుస్తకానికి కాని, ఆహుతులకు కాని ఏవిధంగా సంబంధంలేని ఉపన్యాసం. పైగా చెప్పవలసి వస్తే ఆయన ప్రసంగాన్ని హర్షించినవారు ఒక్కరూ కూడా లేరు. ఈ దేశంలో ఏ జాతివారిని పల్లెత్తు మాట కూడా అనకూడదు, అంటే ఆ జాతి మొత్తం తిరగబడి ప్రాణనష్టం, ఆస్తినష్టం కలిగిస్తారు. కాని బ్రాహ్మణులని మాత్రం యధేచ్ఛగా, విచ్చలవిడిగా నోటికొచ్చినట్లు దూషించవచ్చు. అడిగేవాడు వుండడు. పైగా లోలోపల సంతోషించేవారే ఎక్కువ. మరి బ్రాహ్మణులు ఎందుకు నోరు మూసుకుని, చేతులు కట్టుకుని వున్నారు. అది భగవంతుడికెరుక. సదరు ఉపన్యాసకర్త ఉపన్యాస సారాంశం ఏమిటంటే దేశంలోని అన్ని అరిష్టాలకు కారణం బ్రాహ్మణులు. ముఖ్యంగా ముస్లిముల దుస్థితికి ముఖ్యకారణం బ్రాహ్మణులు. ఎంత తెలివితక్కువ, అవివేకతనం. ఎంతటి నిర్లక్ష్య ఉపన్యాసం. ఆయన మాటలలో ఇసుమంతైనా నిజం లేదు. కనీసం జవాబుదారితనం కూడా లేదు. భారతదేశం స్వాతంత్ర్యం వచ్చాక ముస్లిములు ఎన్ని బాధలు అనుభవిస్తున్నారో, ఆయన చెప్పుకుంటూ వచ్చాడు. అవన్నీ అబద్ధాలే. పైగా దళితుల మీద లేని ప్రేమను నటిస్తూ వారికోసం కూడా మొసలి కన్నీరు కార్చాడు. దళిత ముస్లిములు, దళిత క్రిస్టియన్లు అంటూ ఎందుకు కొరగాని మాటలు వల్లించాడు. మాలో హెచ్చుతగ్గులు లేవంటూ మళ్ళీ దళిత ముస్లిములు, దళిత క్రిస్టియన్లు ఏమిటి? ఒకసారి మతం మారాక, వారు ముస్లిములైనా అవ్వాలి లేదా క్రిస్టియన్లు అయినా అవ్వాలి. అదేకదా న్యాయం. మీరెందుకు రిజర్వేషన్లు అడగడం దళితుల పొట్టలో మట్టి కొట్టడమే కదా. వారి కోటా నుంచే కదా మీకు ఇవ్వాలి. దీనికి బ్రాహ్మణికానికి సంబంధం ఏమిటి? ఏదో నలుగురి చేత చప్పట్లు కొట్టించుకోవడానికి మాట్లాడే మాటలే తప్ప ఆయనదంతా పసలేనివాదన. ఆఖరికి గుజరాత్‌లో మోడిని కూడా ఆయన విడిచిపెట్టలేదు. గుజరాత్ అల్లర్ల తరువాత ముస్లిములు గుజరాత్‌ను వదలి వెళ్ళిపోయినట్లు మాట్లాడాడు? ఎంత అబద్ధం! 1947 తరువాత పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలో 20 శాతం వున్న హిందువులు, 3 శాతానికి పడిపోయారు. వారు ఏమయ్యారు? పారిపోయారా? చంపేశారా ఎవరైనా చెప్పగలరా? అదీ 1947 తరవాత భారతదేశంలో జనాభా లెక్కల ప్రకారం 10 శాతం నుంచి 20 శాతంకు ముస్లిములు పెరిగారు? మరి ఇన్ని బాధలు భరిస్తూ ఎలా జనాభా పెరిగిందో? కాశ్మీరులో పండిట్‌లు ఏమయ్యారు? ఆయన వీటికి సమాధానాలు చెప్పగలడా? భారతదేశం ప్రెసిడెంట్, భారతదేశ క్రికెట్ కెప్టెన్ ముస్లిము, క్రికెట్‌లో 16 మందిలో కనీసం 5, 6 ముస్లిములు వుంటారు. ఈ అరవైఏళ్ళలో పాకిస్థాన్‌లో కాని, బంగ్లాదేశ్‌లో కాని కీలక పదవులలో ఏనాడైనా హిందువులు వున్నారా? కనీసం క్రికెట్ టీంలో ఒక హిందువైనా ఉన్నాడా? కాబట్టి అర్థం పర్థం లేని వితండవాదంతో ముక్కలైన దేశాన్ని ఇంకా ముక్కలు చెయ్యకండి. ఒకప్రక్క పీస్ మిషనులంటూ మాటలకు ప్రయత్నిస్తుంటే దేశాన్ని పీసులుగా చెయ్యద్దని మనవి చేస్తున్నాను. ఈయన మాటలు ఆ నిర్వాహకులకు ఎన్ని సమస్యలు తెచ్చిపెట్టాయో ఆయనకు తెలుసో లేదో కాబట్టి సభా మర్యాదను గుర్తెరిగి వచ్చిన ఆహూతులను మనసులో పెట్టుకొని ప్రసంగిస్తే బాగుంటుందని అనుకుంటున్నాను. (నేను కూడా మర్యాదను పాటించి అదేమి సభో, ఎవరో, ఏమిటో వ్రాయటం లేదు. ముస్లిము సోదరుడు గ్రహించాలని బ్రాహ్మణ మిత్రుడి మనవి).

* * *

శ్రీ నందన నామ సంవత్సరం చెన్నై తెలుగువారికి శుభంగానే ప్రారంభం అయ్యింది. ఉగాది రోజున తెలుగు సంఘాలన్నీ జరుపుకున్న ఉత్సవాలకి జనం కళకళలాడుతూ వచ్చారు. ప్రతి సమాఖ్య, సంఘం, సమితివారు ఆనందించిన విషయం అదే. ఎవరికి జనుల కొరత లేదు. హాలు నిండాయి. తెలుగువారు కూడా వారి వారి ప్రదేశాలలో బాగానే హాజరయ్యి నిర్వాహకులను ఉత్సాహపరిచారు. ఇదేరకంగా ఇకపై కూడా స్పందిస్తే తెలుగువారి ఉనికి ప్రభుత్వానికి తెలుస్తుంది. పూర్వపు రోజులు గుర్తుకు వస్తున్నాయి. ఈసారి రాబోయే ఉగాది ఉత్సవాన్ని అన్ని సంఘాలు కలిపి జరుపుకుంటే ఇంకా బాగుంటుంది. దీనికి ఎవరైనా పూనుకుంటే బాగుంటుంది.

* * *

దేశమంతా స్కాములు, అవినీతి గొడవలే ఇప్పుడున్న ప్రతి మంత్రి మీద ఆరోపణలున్నాయి. వాటికి సమాధానం చెప్పకుండా రాజకీయ నాయకులందరూ ప్రభుత్వమూ, ప్రతిపక్షము ఎదురుదాడికి దిగుతున్నారు. ఇది సిగ్గుచేటు పని. మీమీద అభియోగాలు లేవని నిరూపించుకుని ఆ తరువాత ఆ వ్యక్తిని మీ ఇష్టం వచ్చినట్లు దండించండి. అద్దాల గదిలో నుంచి రాళ్ళు రువ్వకండి. రాజకీయ నాయకులకి చట్టాలన్ని బాగా తెలుసు, నిరంతరం వాటిని అతిక్రమిస్తూనే వుంటారు. అధికార దుర్వినియోగం చేస్తూ వుంటారు. ఎవరైనా వేలెత్తి చూపితే వాడిని అణగదొక్కుదామని ప్రయత్నిస్తున్నారు. ఇది నిరంకుశ పాలనే కాని ప్రజాపాలన కాదు. డెమోక్రసి అంతకంటే కాదు. మహాభారతంలోని రాజనీతిని కాస్త గుర్తుకు తెచ్చుకుందాం. "ప్రజల సుఖమే పాలకుని సుఖము. ప్రజల ప్రియమే పాలకుని ప్రియము, ప్రజల హితమే పాలకుని హితము" ఇలా ఆలోచించే నాయకుడు ఎవరైనా వున్నారా? నాయకుడు ధర్మవర్తనుడైతే ప్రజలు ధర్మవర్తనులుగా వుంటారు. రాజు పాపి అయితే ప్రజలు పాపి అవుతారు. ప్రజలు రాజును అనుసరిస్తారు. పాలకుడు ఎలానో ప్రజలు అలాగే వుంటారు. ఇప్పటి మన భారతదేశ పరిస్థితి ఇదే. ఒకరిని చూసి ఒకరు లంచం తీసుకుంటున్నందువల్ల ఈ లంచగొండితనం వేళ్లూనికొని పోయింది. కాబట్టి దేశానికొక్క అన్నా హాజరే సరిపోడు, వీధికొక్క అన్నహాజారే కావాలి. ముందు మనం లంచం ఇవ్వకూడదని ప్రతినబూనాలి. ఇవన్నీ సాధ్యమా? నిండు పార్లమెంట్‌లో సభ్యులముందు లంచగొండితనాన్ని ఏమి చెయ్యలేకపోయానే అని రక్షణ మంత్రి ఎ.కె. ఆంటోని కన్నీరుమున్నీరుగా విలపించాడు. కాని ప్రయోజనం శూన్యం. ●